

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
శనివారం 1 నవంబరు 2025





అంగరంగ వైభవంగా.. మచిలీపట్నంలోని చిలకలపూడి పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మంత్రి కొల్లు రవీంద్ర, నీలిమ దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పూజలు నిర్వహించారు. 6





పఠాన్‌పేటలో కృష్ణా యూనివర్సిటీకి కేటాయించిన భూములు (ఇన్‌సెట్‌లో) రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

కృష్ణా యూనివర్సిటీకి ప్రభుత్వం కేటాయించిన భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ఆ భూములకు నకిలీ సర్వే నెంబర్లతో పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. అంతటితో ఆగకుండా రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసి ప్లాట్లుగా విడగొడుతున్నారు. ఎకరం రూ.1.50 కోట్లకు విక్రయిస్తుండటమే కాకుండా ప్రచారం కూడా విస్తృతంగా చేస్తున్నారు. రెవెన్యూ రికార్డుల్లో కూడా పేరు మారడం వెనుక కొందరు అధికారుల హస్తం ఉందని తెలుస్తోంది.

రియల్ మాయ

కృష్ణా యూనివర్సిటీ భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్

- గూడూరులోని భూములకు దొంగ రిజిస్ట్రేషన్లు
- ప్లాట్లుగా విభజించి విస్తృత ప్రచారం.. విక్రయాలు
- ఆక్రమణదారులకు రెవెన్యూ అధికారుల వత్తాసు
- తెరవెనుక చక్రం తిప్పుతున్న ఓ వీఆర్వో
- ఎకరం భూమి రూ.1.50 కోట్లుగా ప్రచారం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణా యూనివర్సిటీ నిర్మాణం కోసం 2010లో మచిలీపట్నం మండలం రుద్రవరంలో 102.50 ఎకరాలు, గూడూరు మండలంలోని గూడూరు గ్రామ శివారు పఠాన్‌పేటలో 44 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. రుద్రవరంలో కేటాయించిన భూమిలో యూనివర్సిటీ భవనాలు నిర్మించారు. పఠాన్‌పేటలో 443/3, 444 తదితర సర్వే నెంబర్లలోని 44 ఎకరాల భూమిని గతంలో కొందరు సాగుచేశారు. తాము సాగు చేసుకుంటున్న భూములను యూనివర్సిటీకి కేటాయించడంతో 2010లో రైతులు ఈ భూములను మళ్లీ సాగుచేసే ప్రయత్నం చేశారు. దీంతో అప్పట్లో రెవెన్యూ అధికారులు, పోలీసులు జోక్యం చేసుకుని ఆక్రమణకు గురికాకుండా ఆపారు. నాటి నుంచి ఈ భూములు ఖాళీగానే ఉన్నాయి. ఇటీవల కొందరు ఆక్రమించే ప్రయత్నం చేయగా, రెవెన్యూ అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు.

గుట్టుచప్పుడు కాకుండా కొనుగోలు

కృష్ణా యూనివర్సిటీ భూములపై కన్నేసిన అక్రమార్కులు కొంత కాలం వేచిచూశారు. ఆ తరువాత తమ వ్యూహానికి పదునుపెట్టారు. నకిలీ సర్వే నెంబర్లతో పఠాన్‌పేటలోని కొంత భూములను ఆక్రమించేందుకు తమకు అనుకూలమైన వీఆర్వోను ఈ ప్రాంతానికి తెచ్చుకున్నారు. గుట్టుచప్పుడు కాకుండా యూనివర్సిటీకి కేటాయించిన ప్రభుత్వ భూములను రెవెన్యూ రికార్డుల్లో పట్టా భూములుగా మార్చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అదే గ్రామంలోని వేరే భూములకు చెందిన సర్వే నెంబర్లను యూనివర్సిటీకి కేటాయించిన భూములుగా చూపి రిజిస్ట్రేషన్లు కూడా చేయించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో అక్రమార్కులకు గూడూరు మండలంలో పనిచేస్తున్న ఓ వీఆర్వో, రెవెన్యూ అధికారులు సహకరించారని స్థానిక మిగతా 6లో..

ప్లాట్లుగా విభజించి.. విక్రయాలకు తెరతీసి..

పఠాన్‌పేటలో కృష్ణా యూనివర్సిటీకి చెందిన భూములను దొంగ రిజిస్ట్రేషన్ చేయించారని, మరికొంత భూమిని వేరే సర్వే నెంబర్ల ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారనే సమాచారంతో గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ఆ భూములను పరిశీలించారు. అవి కృష్ణా యూనివర్సిటీకి చెందినవని, ఎవరూ ఆక్రమించడం లేదా కొనడం చేయకూడదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే, ఈ భూములను ఆక్రమించి, నకిలీ నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేయించిన అక్రమార్కులు ప్లాట్లుగా విభజించి విక్రయాలు జరుపుతూనే ఉన్నారు. మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి 65కు సమీపంలో ఉన్న ఈ భూమిని ఎకరం రూ.1.50 కోట్లకు కొన్నామని, జాతీయ రహదారి విస్తరణ నేపథ్యంలో ధర మరింత పెరుగుతుందని ప్రచారం చేస్తూ ఈ విక్రయాలు జరుపుతున్నారు.



పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద వరద ప్రవాహం

పులిగడ్డ ఆక్విడెక్ట్‌కు వరద

16.5 అడుగులకు నీటి ప్రవాహం

అవనిగడ్డ రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డ ఆక్విడెక్ట్‌కు వరద భారీగా చేరుతోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి వస్తున్న వరద కారణంగా శుక్రవారం ఇక్కడ నీటిమట్టం 16.5 అడుగులకు చేరింది. దీనిపై ఇరిగేషన్ డీఈఈ గణపతిరావు మాట్లాడుతూ ఫ్లాష్ ఫ్లడ్స్ కారణంగా ప్రస్తుతం వరద ప్రవాహం కొనసాగుతోందని, మరో రెండు రోజులు ఇలాగే ఉంటుందన్నారు. తీరప్రాంత ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు.

నదిలో బైకులు గల్లంతు

అవనిగడ్డ మండలం పాత ఎడ్లంక వద్ద కృష్ణానదిలో గురువారం కొన్ని మోటారు సైకిళ్లు గల్లంతయ్యాయి. వరదలకు ఏమరపాటుగా ఉన్న కొందరు తమ బైకులు నది ఒడ్డున నిలిపి ఉంచగా, రాత్రికి ఒక్కసారిగా పెరిగిన ప్రవాహానికి కొట్టుకుపోయాయి. కొందరు వరదలో దిగి అతికష్టం మీద తమ బైకులు తెచ్చుకున్నారు.



భిక్షాటన చేసేవారిని సామాజిక భద్రత పరిధిలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. మానసిక, శారీరక దీర్ఘకాలిక రుగ్మతలతో బాధపడుతూ రోడ్ల వెంబడి, బస్టాండ్, రైల్వేస్టేషన్, ఇతర జనసంచార కూడళ్లలో బిచ్చమెత్తుకునే వారిని గుర్తించేందుకు సమాయత్తమవుతోంది. వీరికి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, వృత్తి శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించేందుకు, మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సిద్ధమవుతోంది.

భిక్షాటన చేసే వారికి సామాజిక భద్రత

మార్గదర్శకాలు ప్రకటిస్తూ జీవో జారీ

- పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి నైపుణ్య శిక్షణ
- ఉపాధి కల్పించడంతో పాటు కౌన్సెలింగ్ కూడా..
- భిక్షాటన చేసేవారిని గుర్తించే పనిలో టాస్క్‌ఫోర్స్
- జిల్లాలో వెయ్యికి పైగానే ఉన్నట్టు అంచనా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ) : రాష్ట్రంలో భిక్షాటనను రద్దుచేస్తూ ప్రభుత్వం ఇటీవల జీవో జారీ చేసింది. వ్యవస్థీకృత భిక్షాటనను పూర్తిగా నిర్మూలించి, బలవంతపు భిక్షాటన నుంచి దివ్యాంగులు, చిన్నారులను కాపాడాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోదముద్ర వేసిన జీవో 58ను న్యాయశాఖ ముఖ్య కార్యదర్శి ప్రతిభాదేవి విడుదల చేశారు. సమన్వయంతో ఈ చట్టాన్ని అమలు చేసే బాధ్యతను సంక్షేమ, పోలీసు శాఖలపై ఉంచింది.

మార్గదర్శకాలు ఇవే..

భిక్షాటన చేసే వారిని గుర్తించేందుకు టాస్క్‌ఫోర్స్‌ను ప్రభుత్వం ఏర్పాటుచేస్తుంది. మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, గ్రామ పంచాయతీలు, నగరాల్లోని సంక్షేమ శాఖల ఉద్యోగులు, స్థానిక పోలీసులు బృందాలుగా ఏర్పడి ఆయా ప్రాంతాల్లోని భిక్షాటకులను గుర్తించాలి. వీరిని ప్రభుత్వం ఏర్పాటుచేసే పునరావాస కేంద్రాలకు తరలించి భోజనం, మెరుగైన వైద్యసేవలు అందించాలి. మానసిక వైద్య నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పించాలి. వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించాలి. పింఛన్లు, మిగతా 6లో..

మొంథా తుఫాను తీవ్రత తగ్గడంతో అధికారులు పంటనష్టాన్ని అంచనా వేసే పనిలో పడ్డారు. కలెక్టర్ ఆదేశాలతో శుక్రవారం వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికను తయారు చేశారు.

ఎంత కష్టం.. నష్టం

జిల్లాలో మొదలైన పంటనష్టం అంచనాల తయారీ

క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న వ్యవసాయ, ఉద్యాన అధికారులు

- రైతులతో మాట్లాడి యాప్‌లో వివరాల నమోదు
- పునరావాస కేంద్రాల్లో బాధితులకు కిట్ల పంపిణీ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మొంథా తుఫాను మిగిల్చిన నష్టం నుంచి రైతులు ఇప్పట్లో కోలుకునే పరిస్థితి కనిపించట్లేదు. జిల్లాలో కోతకు వచ్చే దశలో ఉన్న వరిపంట 46,357 హెక్టార్లలో దెబ్బతిన్నట్టుగా వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. నష్టం అంచనాలు తయారు చేయాలని కలెక్టర్ బాలాజీ శుక్రవారం ఇచ్చిన ఆదేశాలతో వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు ఆ పనిలో పడ్డారు. ఏపీఏఐఎంఎస్-2.0 యాప్‌లో పంటనష్టం వివరాలను నమోదు చేసేలా ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ యాప్‌లో పంటనష్టం 33 శాతం కంటే తక్కువ జరిగిందా, ఎక్కువ జరిగిందా అనే వివరాలు నమోదు చేయాల్సి ఉంది. కలెక్టర్ ఆదేశాలతో సాధ్యమైనంత త్వరగా అంచనాల జాబితాలను తయారు చేస్తామని వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు చెబుతున్నారు.



చల్లపల్లి మండలం పాగోలులో పంట వివరాలు తెలుసుకుంటున్న అధికారులు, శాస్త్రవేత్తలు

జిల్లాలో నష్టం ఇలా..

మొంథా తుఫాను కారణంగా జిల్లాలో 528 ఇళ్లు ధ్వంసమైనట్టుగా అధికారులు గుర్తించారు. విద్యుత్ శాఖకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, మిగతా 6లో..

కిట్ల అందజేత

తుఫాను కారణంగా రెండు మూడు రోజులపాటు జీవనభృతి కోల్పోయిన చేనేత, మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వ నిత్యావసరాలతో కూడిన కిట్లను అందించే పనిని అధికారులు ప్రారంభించారు. చేనేత, మత్స్యకారుల కుటుంబాలకు 50 కిలోల బియ్యం, లీటరు పామాయిల్, కందిపప్పు, పంచదార, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు (కిలో చొప్పున) అందజేస్తున్నారు. వీటితో పాటు పునరావాస కేంద్రాల్లో ఉన్న ఒకరికి రూ.వెయ్యి, ఇద్దరుంటే రూ.2 వేలు, ఎంతమంది ఉంటే అన్ని వేల చొప్పున ఖాతాల్లో జమ చేయనున్నారు.



వరద ముంపు నుంచి బయటపడిన పెనుగంచిప్రోలు కాజ్‌వే

శాంతించిన మునేరు

- 39,878 క్యూసెక్కులకు తగ్గిన వరద
- ఊపిరిపీల్చుకున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ/కంచికచర్ల) : మునేరు శాంతించింది. తెలంగాణాలోని వరంగల్, జనగామ, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మునేరు, పాలేరు వాగులు వెనక్కి తగ్గాయి. గురువారం రాత్రి వరకు 1.65 లక్షల క్యూసెక్కుల వరకు వచ్చిన వరద శుక్రవారం సాయంత్రానికి 39,878 క్యూసెక్కులకు తగ్గింది. వరద తగ్గుముఖం పట్టడంతో నీటమునిగిన చిల్లకల్లు-వైరా కాజ్‌వే పైకి తేలింది. రాకపోకలను ఇంకా అనుమతించలేదు. పెనుగంచిప్రోలు కాజ్‌వేను మూసివేసినప్పటికీ వాహనాల రాకపోకలను అనుమతించారు. గురువారం రాత్రికి 1.65 లక్షల క్యూసెక్కులకు వరద చేరటంతో ఏ క్షణమైనా నందిగామ మండలం ఐతవరం వద్ద జాతీయ రహదారిపైకి మునేరు చేరే పరిస్థితి కనిపించింది. 11 గంటల తర్వాత నుంచి వరద ప్రవాహం క్రమంగా తగ్గడం మొదలైంది. శుక్రవారం ఉదయం 6 గంటలకు 92 వేల క్యూసెక్కులకు, మధ్యాహ్నం 12 గంటలకు 67 వేల క్యూసెక్కులకు, సాయంత్రం 4 గంటలకు 52 వేల క్యూసెక్కులకు వరద తగ్గింది. సాయంత్రానికి 39,878 క్యూసెక్కులకు చేరింది. రాత్రికి మరింత తగ్గుముఖం పడుతుందని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

జిల్లాల పునర్విభజనకు సంబంధించి కూటమి ప్రభుత్వం చూపిస్తున్న 'ఒక నియోజకవర్గం.. ఒకే డివిజన్' విధానాన్ని ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు స్వాగతిస్తున్నారు. మూడు నియోజకవర్గాల సమస్యను తక్షణం పరిష్కరించటానికి 'ఆంధ్రజ్యోతి' ఉదహరించిన గన్నవరం, మైలవరం రెవెన్యూ డివిజన్ల ఏర్పాటును ఆహ్వానిస్తున్నారు. ఇందుకు సానుకూలంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడానికి సిద్ధమవుతున్నారు.

రెవెన్యూ డివిజన్లు కరెక్టే..

ఆంధ్రజ్యోతి కథనంపై ప్రజాప్రతినిధుల హర్షం

- గన్నవరం, మైలవరం రెవెన్యూ డివిజన్లకు స్వాగతం
- యంత్రాంగంతో చర్చిస్తామని హామీ
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని భరోసా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లాలో మైలవరం, కృష్ణాజిల్లాలో గన్నవరం, పామర్రు నియోజకవర్గాలు రెండేసి డివిజన్ల పరిధిలో ఉన్నాయి. వీటిని ఎలా సరిచేయాలన్నది ప్రశ్నార్థకంగా మారింది. 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం నాటి సంచికలో 'రెవెన్యూ డివిజన్లు' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. పరిష్కార మార్గాలను సూచించింది. ఈ కథనంపై గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సానుకూలంగా స్పందించారు. ఈ పరిష్కార మార్గాలను యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించేలా కృషి చేయాలని భావిస్తున్నారు. అలాగే, మంత్రుల కమిటీతో పాటు వ్యక్తిగతంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన చెప్పారు. పెనమలూరు కూడా ఎన్టీఆర్ జిల్లాలోనే మిగతా 6లో..



మైలవరం డివిజన్‌తోనే పరిష్కారం



ప్రభుత్వం 'ఒక నియోజకవర్గం.. ఒక డివిజన్' విధానాన్ని తీసుకు రావడాన్ని స్వాగతిస్తున్నాను. గత ప్రభుత్వంలో ఉండగా, మైలవరం డివిజన్‌ను ఏర్పాటు చేయాలని పోరాడాను. ఏది ఏమైనప్పటికీ విభజన చిక్కుముడులను విడదీయటానికి ప్రభుత్వం సూచించిన ఆలోచన మంచిది. ఇందులో భాగంగానే మైలవరం డివిజన్‌ను ప్రతిపాదించాలని 'ఆంధ్రజ్యోతి' కూడా సూచించింది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాను. - వసంత కృష్ణప్రసాద్, మైలవరం ఎమ్మెల్యే

స్వాగతిస్తున్నాం..



గన్నవరం రెవెన్యూ డివిజన్ ఏర్పాటును స్వాగతిస్తున్నాం. ఆంధ్రజ్యోతి సూచించిన విధంగా ఇది మంచి ప్రతిపాదన. గన్నవరాన్ని విజయవాడలో కలపాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ప్రతిపాదనలను అందించాను. నా నియోజకవర్గంలో బాపులపాడు, ఉంగుటూరు మండలాలు ఉన్నాయి. వీటిని విజయవాడలో కలిపితే ఎలా ఉంటుందన్న దానిపై పరిశీలన చేయాలని డీఆర్‌సీ సమావేశంలో చెప్పాను. కానీ, అధికార యంత్రాంగం సీరియస్‌గా తీసుకోలేదు. ఇప్పటి వరకు ఎలాంటి నివేదిక ఇవ్వలేదు. ప్రభుత్వం 'ఒక నియోజకవర్గం.. ఒక రెవెన్యూ డివిజన్' అనే విధానంలో ఉంది కాబట్టి.. గన్నవరం రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేస్తే బాగుంటుంది. విమానాశ్రయంతో పాటు పోలీసు సబ్ డివిజన్ కూడా ఇక్కడ ఉంది. ఈ విషయాన్ని జిల్లా యంత్రాంగం, ఇన్‌చార్జి మంత్రి, ప్రభుత్వం దృష్టికి మళ్లీ తీసుకెళ్తాను.
- యార్లగడ్డ వెంకట్రావు, గన్నవరం ఎమ్మెల్యే



వైద్యవిద్యలో నూతన ఒరవడి
- నేడు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ స్నాతకోత్సవం 8

కష్టం మింగేస్తున్నారు!
- జీజీహెచ్ సెక్యూరిటీ ఆవేదన



జై దుర్గాభవానీ..
- నేటి నుంచి భవానీ మండల దీక్షల స్వీకరణ 6

అవుట్ ఫెయిల్ స్లూయిజ్స్!
- కోడూరు మండలంలో కొత్త నిర్మాణాల ఊసే మరిచారు



రన్ ఫర్ యూనిటీ ర్యాలీలో అధికారులు, సిబ్బందితో కలిసి పాల్గొన్న డీఆర్ఎం మోహిత్ సోనాకియా

పటేల్ నుంచి ప్రేరణ పొందాలి

» డీఆర్ఎం మోహిత్ సోనాకియా

రైల్వేస్టేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 560కి పైగా సంస్థానాలను ఏకం చేయడంలో బలమైన ఏకీకృత దేశానికి పునాది వేయడంలో కీలకపాత్ర పోషించారని విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) మోహిత్ సోనాకియా అన్నారు. ప్రజాజీవితంలో పటేల్ అంకితభావం, జాతి నిర్మాణం సమగ్రత ఆదర్శాల నుంచి ప్రేరణ పొందాలని ఆయన సిబ్బందిని కోరారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి రాష్ట్రీయ ఏకతా దివస్ (జాతీయ ఐక్యతా దినోత్సవం)ను ఉత్సాహంగా, దేశభక్తితో జరుపుకుంటున్న సందర్భంగా విజయవాడ డివిజన్ సిబ్బంది, అధికారులు శుక్రవారం పటేల్‌కు ఘనంగా నివాళులర్పించారు. డివిజనల్ ప్రధాన కార్యాలయంలో అధికారులు సిబ్బంది చేత డీఆర్ఎం రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. బలమైన ఏకీకృత దేశానికి పునాది వేయడంలో ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలక పాత్రను ఆయన వివరించారు. ప్రజా జీవితంలో సర్దార్ పటేల్ అంకిత భావం, జాతి నిర్మాణం సమగ్రత ఆదర్శాల నుండి ప్రేరణ పొందాలని సిబ్బందిని కోరారు. వేడుకల్లో భాగంగా, డివిజన్ సామూహిక బలం ఏకత్వ స్ఫూర్తికి ప్రతీకగా 'ఐక్యత పరుగు'ను నిర్వహించింది.



ప్రాజెక్ట్ కామధేను ఆవరణలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని

సమైక్యశక్తికి స్ఫూర్తి సర్దార్ వల్లభాయ్ పటేల్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : దేశ సమైక్యతతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని ఆచరణలో చూపిన మహనీయుడు మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్‌పటేల్ అని కృష్ణా మిల్క్‌యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. వీరవల్లి ప్రాజెక్ట్ కామధేను(విజయ పాలఫ్యాక్టరీ) ఆవరణలో శుక్రవారం సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అఖండ భారతావనిగా తీర్చిదిద్దిన ఘనత మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్‌పటేల్‌తోనే సాధ్యమయిందన్నారు. ఫ్యాక్టరీ సిబ్బంది, విద్యార్థులతో కలిసి జాతీయ సమైక్యతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎండీ కొల్లి ఈశ్వరబాబు, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పాండురంగ స్వామికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న మంత్రి రవీంద్ర దంపతులు, చిత్రంలో డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ తదితరులు

వైభవంగా పాండురంగని ఉత్సవాలు ప్రారంభం

» స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పాండురంగస్వామి కృప రాష్ట్ర ప్రజలందరికీ ఉండాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆకాంక్షించారు. మచిలీపట్నం చిలకలపూడిలోని పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయాన్నే నగర సంకీర్తన అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర, నీలిమ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, అర్బన్ బ్యాంకు చైర్మన్ ఐ.దిలీప్‌కుమార్, మోటమర్రి బాబా ప్రసాద్, పంచపర్వాల కాశీవిశ్వనాథంలు పాల్గొన్నారు. అనంతరం మంత్రి రవీంద్ర సహస్రలింగ మండపం, రుక్మిణి మందిరంలను సందర్శించి మొక్కుబడులు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. ఈనెల 1న కళ్యాణం, 2న రథోత్సవం, 3న తెప్పోత్సవం, 4న సాంస్కృతిక కార్యక్రమాలు, 5న సముద్ర హారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, 5వ తేదీ కార్తీక పౌర్ణమి సందర్భంగా మంగినపూడి బీచ్‌కు విజయవాడ, మచిలీపట్నం ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామన్నారు. గొర్రెపాటి గోపీచంద్, టేకి నరసింహం, చిన్నం శివ, లంకే నారాయణ ప్రసాద్, కరెడ్ల సుశీల, పిప్పళ్ల కాంతారావు, వెంకటస్వామి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆటోమోటివ్, ఈవీ కాన్ఫరెన్స్ ప్రారంభ జ్యోతి ప్రజ్వలనలో అతిథులు

భవిష్యత్‌లో ఈవీ మార్కెట్ అపూర్వవృద్ధి

» ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆన్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ అధ్యక్షుడు ప్రసన్న రామమూర్తి

కానూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : రానున్న కాలంలో ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) మార్కెట్ వృద్ధి అపూర్వంగా ఉంటుందని ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆన్ సిస్టమ్స్ ఇంజనీరింగ్(ఐఎన్‌సీవోఎస్ఈ) అధ్యక్షుడు ప్రసన్న రామమూర్తి చెప్పారు. కానూరులోని పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ, పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగే ఆటోమోటివ్ అండ్ ఈవీ కాన్ఫరెన్స్-2025 ప్రారంభమైంది. కార్యక్రమాన్ని ప్రసన్న రామమూర్తి జ్యోతిని వెలిగించి ప్రారంభించి ప్రసంగిస్తూ.. ఈవీల వల్ల ఉద్గారాలు, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడానికి, ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడానికి కీలకమైనవని తెలిపారు. ఆటోమోటివ్ రంగం ఆర్థిక వృద్ధి, అవిష్కరణలు, జీడీపీ, ఉద్యోగ సృష్టికి ఇది సహాయపడుతుందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాలు, సరసమైన మోడళ్ల లభ్యత కారణంగా ఈవీ మార్కెట్ భవిష్యత్ గొప్పగా ఉంటుందని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ఎఫ్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ వ్యవస్థాపకుడు డి.రామకృష్ణ మాట్లాడుతూ, మౌలిక సదుపాయాలు, ఇంధనం, ఆరోగ్య సంరక్షణ, సాంకేతికతకు పరిష్కారాలను రూపొందించడానికి, అమలుచేయడానికి నైపుణ్యంగల ఇంజనీర్లు కీలకమని చెప్పారు. మారుతున్న సాంకేతిక పురోగతికి అనుగుణంగా పోటీని కొనసాగించడానికి నిరంతర నైపుణ్యాభివృద్ధి చాలా ముఖ్యమని పేర్కొన్నారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(ఐసీసీ) పూర్వ చైర్మన్ జేఎస్ఆర్‌కే ప్రసాద్, సిద్ధార్థ అకాడమి అధ్యక్షుడు ఎం.రాజయ్య, ఉపాధ్యక్షుడు వి.నాగభూషణరావు, సిద్ధార్థ వర్సిటీ వీసీ వెంకటేశ్వరరావు, వీసీ ఏవీ రత్నప్రసాద్, పీవీపీ కళాశాల ప్రిన్సిపాల్ కొండపల్లి శివాజీబాబు, సమన్వయకర్తలు అనూష, ఎస్.విజయానంద్ తోపాటు ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.




» 41 రోజుల కఠిన దీక్షతో అమ్మ కటాక్షం

» నేటి నుంచి భవానీ మండల దీక్షల స్వీకరణ

జై భవానీ..

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గగుడిలో భవానీ దీక్షల స్వీకరణ కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభం కానుంది. 41 రోజుల కఠిన దీక్షతో అమ్మవారి కటాక్షం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ప్రస్తుతం మండల దీక్షలు (41 రోజులు) ప్రారంభమవుతాయి. తరువాత మరో 20 రోజులకు అర్ధమండల దీక్షలను స్వీకరిస్తారు. కొందరు భక్తులు 11 రోజుల దీక్ష కూడా స్వీకరిస్తారు. దీక్షాకాలం పూర్తి అయ్యాక ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ సన్నిధిలోనే విరమణ చేస్తారు. వీలుకాని భక్తులు తాము ఉంటున్న ప్రదేశాలలోనే అమ్మవారి ఆలయానికి వెళ్లి విమరణ చేయాల్సి ఉంటుంది. కాగా చాలామంది భక్తులు దసరా ఉత్సవాల ప్రారంభం సమయంలో 11 రోజుల దీక్ష తీసుకుని విరమణ చేశారు. నవంబరు 1 ఉదయం 8.45 గంటల నుంచి 5వ తేదీ వరకు భవానీ మండల దీక్ష ధారణలు ప్రారంభమవుతాయి. అర్ధమండల దీక్షలు నవంబరు 21 నుంచి 25 వరకు స్వీకరిస్తారు. డిసెంబరు 4వ తేదీ కలశజ్యోతి ఉత్సవం, డిసెంబరు 11 నుంచి 15 తేదీ వరకు భవానీదీక్ష విరమణలు ప్రారంభం అవుతాయి. ఈ సందర్భంగా అగ్నిప్రతిష్టాపన, శతచండీయాగం, గిరి ప్రదక్షిణలు జరుగుతాయి. ఈ సందర్భంగా దుర్గగుడిలో డిసెంబరు 11 నుంచి 15వ తేదీ వరకు అన్ని ఆర్జిత సేవలను రద్దు చేస్తారు.

అమ్మ అనుగ్రహం

భవానీ దీక్షల కోసం అత్యంత జాగ్రత్త పాటించాల్సి ఉంటుంది. అమ్మ అనుగ్రహం పొందాలనుకునేవారు ఎంతో భక్తితో మాలను ధరిస్తారు. నిత్యం అమ్మవారి నామస్మరణ చేయాలి. ఇతరులను 'భవానీ' అని పలకరిస్తారు. వారి హృదయంలో కనకదుర్గమ్మ కొలువై ఉన్నట్టు భావించాలి. దీక్షా కాలంలో చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా ఉండాలి.

శక్తి స్వరూపిణి..

అత్యంత శక్తిస్వరూపిణి అమ్మవారి అనుగ్రహం కోసం భక్తతలు దీక్షను చేపడుతారు. భక్తిశ్రద్ధలతో నియమాలను అనుసరిస్తారు. ఎరుపు రంగు వస్త్రాలు ధరిస్తారు. దీక్ష చేపడితే సకల ఫలాలు దక్కుతాయని హిందూ ధర్మ గ్రంథాలు చెబుతున్నాయి. సంతాన ప్రాప్తి, మనో ధైర్యం కలిగేందుకు మనస్సు నిర్మలంగా ఉండేందుకు, శుభాలు కలిగేందుకు, అమ్మవారి కటాక్షం పొందేందుకు ఈ దీక్ష చేపడతారు. దీక్ష చేపడితే సకల శుభాలు కలుగుతాయనే నమ్మకం ఉంది. దీక్షలో ఉన్నంత కాలం అమ్మవారికి నిత్యం రెండు పూటలా పూజా కార్యక్రమాలు చేపడతారు. చివరిరోజు అమ్మవారి ఆలయానికి చేరుకుని దీక్ష విరమిస్తారు. 41 రోజుల పాటు అనుసరించిన మంచి నడతను దీక్ష విరమించిన తరువాత కూడా కొనసాగించ గలిగితేనే దీక్ష స్వీకరణకు అర్థముంటుందని చెబుతారు.

దీక్షా నియమాలు..

వీలైతే ఇంట్లో అమ్మవారికి త్రికాల పూజలు, భజనలు చేయడం, సాత్విక ఆహారాన్ని స్వీకరించడం, నేలపై పడుకోవడం, చన్నీటి స్నానం చేయడం, నుదుటన ఎర్రటి కుంకుమ బొట్టును పెట్టుకోవడం, బ్రహ్మచర్యం పాటించడం వంటి పలు నియమాలను అనుసరించడం ద్వారా దీక్షకు పరిపూర్ణత వస్తుందని చెబుతారు. శాంభవి, శాంకరి, కనకదుర్గాంబ, కంచి కామాక్షి, కాళి, పార్వతి, శంభురాణి, భవాని, సురపూజితగా భక్తులు కొలుస్తారు. శక్తిలోపం లేకుండా ఉన్నంతలో ఆమెకు అర్చనాదులను సమర్పిస్తారు. తమపై అమ్మవారి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటారు. దుర్గగుడి మహామండపం 6వ అంతస్తులో శనివారం ఉదయం 8.45 గంటల నుంచి భవానీ మండల దీక్షా స్వీకరణలు ప్రారంభం కానున్నట్టు ఈవో వీకే శీనా నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆపరేషన్ నార్కోస్.. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై రైల్వే నిఘా

రైల్వేస్టేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : 'ఆపరేషన్ నార్కోస్' కింద విజయవాడ డివిజన్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్), దక్షిణ మధ్య రైల్వే, ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్‌పీ), క్రైమ్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (సీఐబీ), క్రైమ్ ప్రివెన్షన్ అండ్ డిటెక్షన్ స్క్వాడ్‌లు (సీపీడీఎస్)తో కలిసి నిర్వహించిన వేగవంతమైన, సమన్వయ కార్యకలాపాలలో రైళ్లు, రైల్వే ప్రాంగణాల ద్వారా అక్రమంగా రవాణా అవుతున్న ఎండు గంజాయిని విజయవంతంగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్లు అక్టోబర్ 24-30 మధ్య డివిజన్‌లోని కీలక స్టేషన్లలో జరిగాయి. రైల్ మదద్ సమాచారం, ప్రయాణికుల ఫిర్యాదులపై చర్య తీసుకుంటూ, ఉమ్మడి ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు అసాధారణ నిఘా అంతర్-సంస్థ సమన్వయాన్ని ప్రదర్శించాయి. సుమారు రూ.8.79 లక్షల విలువైన190.3 కిలోగ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నేరస్థులను అరెస్టు చేశారు. సామర్లకోట, బాపట్ల, రాజమండ్రి, గూడూరు, ఒంగోలు రైల్వే స్టేషన్లలో ఈ దాడులు జరిగాయి. నిషిద్ధ వస్తువులను స్వాధీనం చేసుకుని, చట్టపరమైన చర్యల కోసం నేరస్థులను అప్పగించారు.



గంజాయి పట్టుకున్న పోలీసులు (ఫైల్)

ఉపాధి పనుల్లో భారీగా అవకతవకలు!

» రూ.9,79,359 రికవరీకి డ్వామా పీడీ ఆదేశం

ఉంగుటూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ ఎస్వీ శివప్రసాద్ యాదవ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక బహిరంగ విచారణ కార్యక్రమం ఎంపీడీవో ఇ.సత్యకుమార్ అధ్యక్షతన జరిగింది. 2024-25సం. మండలంలోని 27పంచాయతీల పరిధిలో 13.34కోట్ల పనులు జరగ్గా గ్రామాల్లో కొద్దిరోజులుగా సామాజిక తనిఖీ బృందం తనిఖీచేసి సిద్ధంచేసిన నివేదికలను ప్రజావేదికలో అందజేసింది. వీటి ఆధారంగా పనుల్లో అక్రమాలకు పాల్పడినట్టు గుర్తించారు. బాధ్యులనుంచి రూ.9,79,359లు రికవరీకి ఆదేశించారు. దీంతో పాటు సిబ్బందికి రూ.1,67000/లు జరిమానా విధించారు. కాగా రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎలుకపాడు సీనియర్ మేట్ అజ్మీర గోపిని విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వడ్లమూడి సరోజిని, అంబుడ్స్‌మెన్ కె.శ్రీనివాసరావు, ఉపాధిసిబ్బంది పాల్గొన్నారు.

భిక్షాటన చేసే వారికి..

(5వ పేజీ తరువాయి)

రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డులు జారీచేసి సామాజిక భద్రత పరిధిలోకి తీసుకురావాలి. ప్రధానంగా వ్యవస్థీకృత భిక్షాటనకు పాల్పడే వారిని అరెస్టు చేయాలి. వారిపై కేసులు నమోదు చేసి శిక్షలు పడేలా చేయాలి. వారి చెరలో ఉన్న చిన్నారులు, దివ్యాంగులకు విముక్తి కల్పించాలి. భిక్షాటన దుష్ఫలితాలపై విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలి.

జిల్లాలో వెయ్యికి పైగానే..

జిల్లాలో వెయ్యికి పైగానే భిక్షాటన చేసే వారున్నారని అధికార యంత్రాంగం ప్రాథమిక నిర్ధారణకు వచ్చింది. ప్రభుత్వం జీవో విడుదల చేసిన నేపథ్యంలో వారందరినీ గుర్తించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ముఖ్యంగా విజయవాడ నగరంలోనే 600కు పైగా భిక్షాటకులు ఉన్నట్టు కార్పొరేషన్ అధికారులు సూచనప్రాయంగా చెబుతున్నారు. కొన్నేళ్లుగా స్మైల్ అనే స్వచ్ఛంద సంస్థ సీతారామపురంలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటుచేసి పలువురు భిక్షాటకులకు ఆశ్రయం కల్పించింది. రైల్వేస్టేషన్, బస్టాండ్ పరిసరాల్లో అత్యధికంగా భిక్షాటకులు ఉంటారని, బెంజిసర్కిల్, ఏలూరు రోడ్డు, బీసెంట్‌రోడ్డు, వన్‌టౌన్ మార్కెట్, రైతుబజార్లు, పెట్రోల్ బంకులు, ఆలయాల వద్ద కాస్త తక్కువ సంఖ్యలో ఉంటారని అధికారులు చెబుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఎంతోమంది నగరంలో భిక్షాటన చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ వీరి సంఖ్య ఎక్కువగానే ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

రెవెన్యూ డివిజన్లు కరెక్టే..

(5వ పేజీ తరువాయి)

ఉండాలన్న అభిప్రాయాన్ని ఇటీవల స్థానిక ఎమ్మెల్యే బోడే ప్రసాద్ వెలిబుచ్చారు. మైలవరం రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలోనే ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పోరాడారు. 'ఆంధ్రజ్యోతి' ప్రతిపాదనను ఆయన కూడా స్వాగతించారు. మైలవరం రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సంబంధించి ఆయన కూడా జిల్లా యంత్రాంగానికి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు సిద్ధమవుతున్నారు.

పోలీస్ సబ్ డివిజన్ల ప్రకారం..

గన్నవరంలో పోలీసు శాఖ సబ్ డివిజన్ ఉంది. కాబట్టి అక్కడ రెవెన్యూ డివిజనల్ కేంద్రం ఏర్పాటుకు ఇబ్బందులు ఉండవు. ఒక నియోజకవర్గం వేర్వేరు నియోజకవర్గాల పోలీసు స్టేషన్ల సమస్యలు కూడా తప్పుతాయి. మైలవరంలో పోలీసు సబ్ డివిజన్ లేదు. తిరువూరులో ఉన్న ఆ సబ్ డివిజన్‌ను మైలవరంలో ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయోగకరంగా ఉండటంతో పాటు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుంది.

విజయవాడ రూరల్ మండలానికి భవిష్యత్తులో పరిష్కారం

ప్రభుత్వం చెబుతున్న 'ఒక నియోజకవర్గం.. ఒక రెవెన్యూ డివిజన్' అనే అంశం విజయవాడ రూరల్ మండలం విషయంలో కుదిరేలా లేదు. ఎందుకంటే విజయవాడ రూరల్ మండలం కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలోనిది. ఒకే రెవెన్యూ డివిజన్ (విజయవాడ డివిజన్) పరిధిలో ఉంది. గన్నవరం నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేస్తే.. విజయవాడ రూరల్ మండలం రెండు నియోజకవర్గాల పరిధిలో ఉంటుంది. ఈ పరిధిలో 14 గ్రామాలు ఉన్నాయి. నియోజకవర్గ పునర్విభజనతో ఈ సమస్యకు చెక్ పడుతుంది. ఎందుకంటే విజయవాడ రూరల్ మండలం ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పాటుచేసే అవకాశం ఉంది. ఈ మండలంలో 1.50 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇది పెడన నియోజకవర్గంతో సమానం. కాబట్టి భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజనలో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

ఎంత కష్టం.. ఎంత నష్టం

(5వ పేజీ తరువాయి)

971 విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో రూ.1.40 కోట్ల నష్టం వాటిల్లినట్లుగా నివేదిక ఇచ్చారు. 12 మేకలు, గొర్రెలు చనిపోగా, 8 పశువుల పాకలు పడిపోయాయని నిర్ధారించారు. 227 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి అందులో 23,744 మందికి ఆశ్రయం కల్పించారు. వరిపంట 46,357 హెక్టార్లలో దెబ్బతిన్నట్లుగా గుర్తించారు. 1,416 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతినగా, 2,229 మంది రైతులకు రూ.73.45 కోట్ల మేర నష్టం జరిగినట్లుగా నివేదిక రూపొందించారు. పంటనష్టం అంచనాల ప్రక్రియ ప్రారంభమైందని పూర్తిస్థాయి నివేదికను తయారుచేసి కలెక్టర్‌కు సమర్పిస్తామని వారు పేర్కొన్నారు.

అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్

భారీవర్షాలతో పంట పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపేందుకు డ్రెయినేజీల్లో తూడు, గుర్రపుడెక్క తదితరాలను తొలగించే పనులను చేయించాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, నీటిపారుదల, డ్రెయినేజీ విభాగం అధికారులతో కలెక్టరేట్ నుంచి ఆయన శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కృత్తివెన్ను మండలం నీలిపూడి, సీతనపల్లి గ్రామాలమధ్య డ్రెయినేజీలో గుర్రపుడెక్క ఉందని, దానిని తొలగించాలని మండల వ్యవసాయశాఖ అధికారి కలెక్టర్‌కు వివరించారు. బంటుమిల్లి మండలం చోరంపూడి వద్ద డ్రెయినేజీ తూములు పూడుకుపోయాయని, నీరు దిగువకు పోకుండా పొలాలను ముంచెత్తుతోందని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. కృష్ణానదికి వరదనీరు రావడంతో నాగాయలంక, కోడూరు మండలాల్లో డ్రెయినేజీల నుంచి నీరు త్వరగా దిగువకు పోవడం లేదని అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

రియల్ మాయ

(5వ పేజీ తరువాయి)

తహసీల్దార్ కార్యాలయ అధికారులే చెబుతున్నారు. ప్రభుత్వ భూమిని పట్టాభూమిగా మార్చడమే కాకుండా, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ అనుచరులు, బంధువుల పేరుతో కొన్నట్టుగా చూపి, దొంగపత్రాలు సృష్టించి కొంతభూమిని రిజిస్ట్రేషన్ కూడా చేయించడం గమనార్హం.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం..

పఠాన్‌పేటలోని కృష్ణా యూనివర్సిటీ భూములను వేరే సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారనే అంశం నా దృష్టికి వచ్చింది. దీంతో ఎవరూ కొనకూడదు, విక్రయించకూడదని ఆ భూముల వద్ద బోర్డులు ఏర్పాటు చేశాం. ఈ అంశంపై మరింతగా విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

- డి.రాజ్యలక్ష్మి, గూడూరు తహసీల్దార్

కోపా స్కాలర్‌షిప్‌లకు ఆహ్వానం

సత్యనారాయణపురం : కులమతాలకు అతీతంగా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించేందుకు కాపు అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (కోపా) దరఖాస్తులను కోరుతున్నట్టు కోపా అధ్యక్షకార్యదర్శులు దావులూరి కైలాసరావు, దుట్టా రమేష్ తెలిపారు. ముత్యాలంపాడులో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, గత 28 సంవత్సరాలుగా ఉమ్మడి కృష్ణాజిల్లాలకు చెందిన మెరిట్ విద్యార్థులను గుర్తించి ఏటా ఉపకారవేతనాలను అందజేస్తున్నామని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, మెడిసిన్, డిప్లమో తదితర కోర్సులలో చదువుతన్న విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు మరింత సమాచారం కోసం 9440239989, 7093639919 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

» రూ.36 కోట్లతో ప్రతిపాదనలు.. ఏళ్లు గడుస్తున్నా నిర్మాణాల ఊసులేదు

» కోడూరు మండలంలో అవుట్‌ఫాల్ స్లూయిజ్ ప్రతిపాదనలకే పరిమితం

» శిథిలావస్థలో పనిచేయని పాలకాయ తిప్ప స్లూయిస్

» 30 వేల నుంచి 15 వేల ఎకరాలకు తగ్గిన ఆయకట్టు

» బీడుగా మారిపోతున్న పంట భూములు

అవుట్ ఫెయిల్ స్లూయిజ్స్!



శిథిలావస్థలో పాలకాయతిప్ప హెడ్ స్లూయిస్

(ఆంధ్రజ్యోతి, కోడూరు) : ఏళ్ల గడుస్తున్నా అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల నిర్మాణం చేపట్టకపోవటంతో కృష్ణా జిల్లా కోడూరు మండలంలో వ్యవసాయం దారితప్పుతోంది. ప్రధానంగా పాలకాయతిప్ప అవుట్‌ఫాల్ స్లూయిజ్‌తో పాటు మరికొన్ని అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లకు అడుగులు ముందుకు పడకపోవటంతో కోడూరు మండల దిగువ ప్రాంతంలో వేలాది ఎకరాలలో సాగు భూమి కాస్తా బీడు భూమిగా మారిపోతోంది. నీటి వనరులు రాక.. ఉన్న వాటిని సద్వినియోగం చేసుకోలేక రైతులు సాగుకు స్వస్తి పలుకుతున్నారు. ముప్పైవేల ఎకరాల ఆయకట్టు నుంచి ఈ ఏడాది పదిహేనువేల ఎకరాల ఆయకట్టుకు పడిపోయింది. ప్రతిపాదనల గడప దాటని అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల వల్ల రైతులు సాగు ఆశలను వదులుకుంటూ.. చేపల చెరువులవైపు చూస్తున్నారు. అవుట్ ఫాల్స్ స్లూయిజ్ నిర్మాణాలు అడుగైనా ముందుకు సాగక ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా ఉంటోంది.

పాలకాయతిప్ప స్లూయిజ్ నిర్మాణంపై నిర్లక్ష్యం

మండలంలో వ్యవసాయానికి ప్రధానమైన పాలకాయతిప్ప అవుట్ పాల్స్ స్లూయిస్ నిర్మాణం చేపట్టేందుకు నాబార్డు నుంచి నిధుల కోసం ప్రతిపాదనలు పంపామని గత ఐదు సంవత్సరాలుగా అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పిందే చెబుతున్నారు. ప్రస్తుతం పాలకాయతిప్ప అవుట్‌పాల్ స్లూయిస్ శిథిలస్థితికి చేరింది. బేస్ దెబ్బతింది. కాంక్రీట్ నుంచి ఐరన్ బయటకు వస్తోంది. తుప్పు పట్టిన ఐరన్, శిథిలస్థితికి చేరిన స్లూయిస్‌ను చూస్తే ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. మండలానికి ప్రతిష్టాత్మకమైన పాలకాయ తిప్ప అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ను కూటమి ప్రభుత్వంలో అయినా పునర్నిర్మాణానికి నిధులు మంజూరుచేసి వెంటనే పనులు చేపడతారని ఆశించిన అన్నదాతలకు నిరాశే ఎదురవుతోంది. గత ప్రభుత్వంలో మాదిరిగానే ప్రస్తుత ప్రజాప్రతినిధులు, అధికారులు అవుట్‌పాల్స్ నిర్మాణ ఎస్టిమేట్లు వేసి నాబార్డు నిధుల కోసం ప్రతిపాదనలు పంపామని చెబుతుండటంతో అన్నదాతల ఆశలు ఆవిరైపోతున్నాయి.

సాగు చేసుకునే దారిలేదు..

పాలకాయతిప్ప కాకుండా ఐదేళ్లుగా 15, 16, 17, 18, 14బీ కాల్వల కింద పంట వేసుకునే పరిస్థితి లేక, వేసిన పంట చేతికి రాక, అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సాగుచేయలేక అన్నదాతలు ఆర్థిక ఇబ్బందులను చవిచూస్తున్నారు. కుటుంబ పోషణే కష్టంగా మారుతోంది. ప్రస్తుతం వస్తున్న అధిక పోట్ల కారణంగా నేరుగా సాగుభూములోకి ఉప్పునీరు చేరి చౌడు భూమిగా పొలాలు మారుతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అన్నదాతల ఆవేదన అర్థం చేసుకొని, వెంటనే అవుట్ పాల్స్ నిర్మాణం చేపట్టే విధంగా, అధికారులు ప్రజాప్రతినిధులు తగుచర్యలు తీసుకోవాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు ఎక్కడ నిర్మిస్తారు?

అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ను ప్రధానంగా నీటినిర్వహణ వ్యవస్థలలో భాగంగా నిర్మించే నిర్మాణాలుగా చెప్పుకోవాల్సి ఉంటుంది. వీటివల్ల నీటి ప్రవాహం, వరదలు, నీటి సరఫరా నియంత్రణ, జలాశయ నిర్వహణ చేపడతారు. జలాశయాలు, కాలువలు, నదులలో నీటి ప్రవాహాన్ని ఇవి నియంత్రిస్తాయి. అధిక వరద నీటిని బయటకు వదలటం ద్వారా వరదల నియంత్రణ జరుగుతుంది. సాగునీటి కోసం కాలువలలో నీటి సరఫరాను నియంత్రించటానికి దోహదపడతాయి. అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లను ప్రత్యేక ప్రాంతాలలోనే ఏర్పాటు చేస్తారు. జలాశయాలు, నదీ బెడ్లు, కాలువలు, తీర ప్రాంతాలు, సాగునీటి ప్రాజెక్టుల దగ్గర వీటిని ప్రత్యేకంగా ఏర్పాటు చేయటం ద్వారా సాగు వ్యవస్థకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటారు.

ఎస్టిమేట్లు పంపాం

- భాను నాయక్, డ్రెయినేజీ డీఈఈ

అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల నిర్మాణానికి ఎస్టిమేట్లు రూపొందించాం. తయారు చేసిన ఎస్టిమేట్లను ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వం నుంచి త్వరలో అనుమతులు వస్తాయని భావిస్తున్నాం.

అలసత్వమే కొంపముంచుతోంది



- వీ పాండు, పాలకాయతిప్ప, రైతు

ప్రజాప్రతినిధులు, అధికారుల అలసత్వం కారణంగానే అవుట్ ఫాల్స్ స్లూయిజ్ నిర్మాణం జాప్యం జరుగుతోంది. గత ఐదేళ్లుగా పంటవేసే పరిస్థితి లేకుండా పోయింది. అన్నదాతల ఆక్రందనలు ఎవరికీ వినిపించడం లేదు. భూములు చౌడుబారిపోతున్నాయి. బీడుభూములుగా వదిలేయాల్సి వస్తోంది. కొందరు లాభం లేక చేపల చెరువులు తవ్వుతున్నారు.

గేట్లను కూడా వేయలేకపోతున్నారు



- సీహెచ్ చిన్న వెంకటేశ్వరరావు

అధికారులు, ప్రజాప్రతినిధులు మాటలు తప్పితే చేతల్లో పనులు కావడంలేదు. ఆధునిక సాంకేతికత పరిజ్ఞానంతో సముద్రంలో వంతెనలు కడుతున్న ఈ రోజుల్లో తుప్పు పట్టిన గేట్లను కూడా పునరుద్ధరించలేకపోవటం బాధాకరం.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

నారా రోహిత్ దంపతులను ఆశీర్వదించిన యార్లగడ్డ



గన్నవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు సోదరుడు కుమారుడు నారా రోహిత్ వివాహానికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హాజరయ్యారు. గురువారం రాత్రి హైదరాబాద్ అజీజ్ నగర్‌లో వైభవంగా జరిగిన వివాహంలో రోహిత్, శిరీష దంపతులను ఆశీర్వదించారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, పులవర్తి నాని, బ్రహ్మారెడ్డి, యరపతినేని శ్రీనివాసరావు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ శ్రీకాంత్‌లతో ముచ్చటించారు.

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

తుఫానుకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్



కందలంపాడులో పడిపోయిన వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపానుతో పంట నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని ప్రభుత్వం అని విధాల ఆదుకుంటుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండల పరిధిలో ముదునూరు, సాయిపురం, జబర్లపూడి, చినఓగిరాలలో శుక్రవారం పర్యటించి తుపానుకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తుపాను ముప్పుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు చూపుతో అధికార యంత్రాగాన్ని అప్రమత్తం చేసి అనునిత్యం పర్యవేక్షిం చడంతో ప్రాణనష్టం, ఆస్తినష్టం తగ్గినప్పటికి వరి, ఇతర పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. వేలాది రూపాయలు ఖర్చుచేసి పంట చేతికొచ్చే తరుణంలో మొంథా తుపాను తీవ్రనష్టం కలగజేయడంతో రైతులు ఆందోళనలో ఉన్నారని, పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి అచ్చెన్నాయుడు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించారన్నారు. ముదునూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పాలడుగు సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాసరావు, శేఖర్, సాయిపురం, జబర్లపూడిలో సర్పంచ్‌లు బాషా, ప్రసాద్, చినఓగిరాల పార్టీ అధ్యక్షుడు కుటుంబరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

రైతు సమస్యలు సీఎంకు వివరిస్తా..

కంకిపాడు: మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతాంగం సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మొంథా తుఫాన్ కారణంగా కందలంపాడులో పడిపోయిన పంటపొలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులకు నేరుగా నష్టపరిహారం అందించాలని పలువురు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అధికశాతం మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయకపోవడంతో ఇలాంటి సమయాల్లో పూర్తిగా దెబ్బ తింటున్నారని పలువురు కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతులు, రైతులు సమస్యలు విన్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు మొవ్వా నరేష్, చలసాని వెంకటేశ్వరరావు, ఆళ్ల నాని, వెలగపూడి వెంకటరమణ, రాంబాబు, కొండ, నాగులు, సాంబయ్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. రైవస్ కాలువపై అసంపూర్తిగా నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని స్థానికులు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు. కుందేరు - కందలంపాడు రహదారి పరిస్థితి అత్యంత అధ్వానంగా మారిందని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పేదరిక నిర్మూలన ప్రభుత్వ లక్ష్యం



గన్నవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని సోషల్ వెల్ఫేర్ డీడీ, నియోజకవర్గ స్పెషలాఫీసర్ షేక్ షాహిద్‌బాబు అన్నారు. మండలంలోని బుద్ధవరంలో మొంథా తుఫాన్ కారణంగా కట్టా కుమారి, కట్టా వీరమ్మ ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పీ-4లో భాగంగా ఇరువురికి టీడీపీ మండల అధ్యక్షుడు గూడపాటి తులసీమోహన్, గన్నవరం ఉపసర్పంచ్ పాలడుగు వెంకట రామ వరప్రసాద్ (నాని)లు రూ.10వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. సర్పంచ్ బడుగు బాలమ్మ, తహసీల్దార్ కేవీ శివయ్య,ముద్రబోయిన శ్రీనివాసరావు, గొంది నరేంద్ర, బోడపాటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాస పూజలు

గన్నవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పాత గన్నవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో శుక్రవారం కార్తీక మాస పూజలు నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం తిరుపతమ్మ మాతృ మండలి సభ్యులచే కార్తీక పురాణం, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ ఆధ్వర్యంలో భోజన ప్యాకెట్లను పేదలకు పంపిణీ చేశారు. జాస్తి ఫణిశేఖర్, చిమట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. సోమవారం రాత్రి ఆలయంలో కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వేడుకగా వేంకటేశ్వరస్వామివ్రతం



హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 31 (ఆంధ్ర జ్యోతి): స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం సామూహిక వేంకటేశ్వరస్వామివ్రతం వేడుకగా నిర్వ హించారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు ట్రస్టీ కాకాని వెంకటేశ్వ రరావు, అరుణ దంపతులు పూజా సామగ్రి ఉచితంగా అందజేశారు. భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో వ్రతం ఆచరించారు.

ముంపు నివారణ చర్యలు

విజయవాడ రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ముంథా తుఫాన్ కారణంగా ఇటీవల కురిసిన వర్షాలకు నున్న గ్రామ పరిధిలోని పలు పంటపొలాలు జలమయమయ్యాయి. పంట పొలాల్లో నిలిచిపోయిన నీటిని రెండు రోజులుగా అధికారులు కాలువలకు మళ్లిస్తున్నారు. వరద నివారణా చర్యలను శుక్రవారం గన్నవరం ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహా రావు పరిశీలించారు. రైతులకు ఇబ్బంది లేకుండా నీటిని మళ్లించి సమస్యను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు గుజ్జర్లపూడి బాబూరావు, నెక్కంటి శ్రీదేవి, కలకోటి శ్రీనివాసరెడ్డి, గంపా శ్రీనివాస్ యాదవ్, గుంటక సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిడమానూరు విద్యార్థిని ప్రతిభ

గన్నవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): భారతరాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని నియోజకవర్గస్థాయిలో శుక్రవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలల్లో పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో ఎంపికైన ముగ్గురు చొప్పున 12 మంది నియోజకవర్గస్థాయి పోటీలకు హాజరయ్యారు. వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు జరిగాయి. దీనిలో జిల్లాస్థాయికి నిడమానూరు జడ్పీహైస్కూల్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థిని పి.చరిత ప్రతిభ చూపి ఎంపికైనట్లు పరిశీలకులు, గుడివాడ డీవైఈవో కొండా రవికుమార్ తెలిపారు. ఎంఈవో-2 కమల, హెచ్‌ఎంలు పార్వతి, హరిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్

రాష్ట్ర అధికార ప్రతినిధిగా వెంట్రప్రగడ



వెంట్రప్రగడ

ఉయ్యూరు, అక్టోబరు 31 (ఆంధ్ర జ్యోతి): ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉయ్యూరుకు చెందిన ఆర్యవైశ్య ప్రముఖుడు వెంట్రప్రగడ వీరాంజనేయులు నియమితులయ్యారు. ఆర్యవైశ్య మహాసభ, సంఘంలో పలు పదవులు అలంకరించిన ఆంజనేయులును ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తూ ఫెడ రేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు నియామకపత్రం అందజేశారు. తన నియామకం పట్ల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోంట్ల రామ్మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సాయం సద్వినియోగం చేసుకోవాలి



హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వంతో పాటు దాతలందించిన సహకారాన్ని సద్వినియోగం చేసు కోవాలని హెచ్‌ఎం వెలమర్తి రవిబాబు విద్యార్థులకు సూచించారు. రేమల్లె ఎంపీపీ మో డల్ స్కూల్ విద్యార్థుల తాగునీటి సౌకర్యార్థం అరివేణి గోపాల కృష్ణమూర్తి వితరణ చేసిన వాటర్‌ట్యాంకును శుక్రవారం హెచ్ ఎంకు అందజేశారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ వడ్లమూ డి వెంకట కృష్ణారావు, మేడేపూడి రంగారావు, వడ్లపట్ల సాంబశివరావు పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సాయం



హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 31 (ఆంధ్ర జ్యోతి): పేద విద్యార్థులకు మానవత ఎల్లప్పుడు అండగా ఉంటుందని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. ఉంగుటూరు మండలం తరిగొప్పలకు చెందిన వైద్య విద్యార్థిని బొకినాల గీతికకు కాలేజీ ఫీజు నిమిత్తం మానవత జంక్షన్ శాఖ సభ్యులు శుక్రవారం రూ. 15వేలు అందజేశారు. మానవత నిర్వాహకులు వేగిరెడ్డి సూరయనారాయణ, జేవీవీ సత్యనారాయణ, చెక్కా సుబ్బారావు, కొట్నేని రామచంద్రరావు, వడ్డి రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బాలిక అనుమానాస్పద మృతి

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): బాపులపాడు జగనన్న కాలనీలో శుక్రవారం అనుమానాస్పద స్థితిలో బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. జంక్షన్ ఎస్సై వి. సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ బిషప్ హజరయ్య స్కూల్ హాస్టల్ ఉంటూ బాలిక (14) 8వ తరగతి చదువుతోంది. బాలిక దసరా సెలవులకు ఇంటికి వచ్చింది. హాస్టల్ ఫీజు తల్లిదండ్రులు చెల్లించకపోవడంతో ఇంట్లోనే ఉంటోంది. ఎవరు లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

ఘనంగా ఆళ్వార్‌దాస్ జయంతి

ఉయ్యూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు ఆళ్వార్‌దాస్ జయంతి ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి అసోసియేషన్ మాజీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ నూకల సాంబశివరావు, డిప్యూటీ గవర్నర్ బాపిరాజు, సత్తార్ నివాళులర్పించారు.

మూడు శాతం స్పోర్ట్స్ కోటా అమలు

గన్నవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మూడు శాతం స్పోర్ట్స్ కోటా అమలు చేస్తున్నట్లు గుడివాడ డీవైఈవో కొండారవికుమార్ అన్నారు. గుడివాడ డివిజన్ అండర్ -17 బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ ఎంపికలు స్థానిక కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జరిగాయి.



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న డీఎస్పీ బంగారురాజు

అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలి

కానూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలని, అందుకు విద్యార్థులు తోడ్పాటు నందించాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీలు యూ. బంగారురాజు, కె. వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకొని రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కానూరులోని సిద్ధార్థ న్యాయ కళాశాలలో కార్యక్రమం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన బంగారురాజు, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, న్యాయశాస్త్ర విద్యార్థులు శాస్త్ర నైపుణ్యాన్ని దేశ సమగ్ర అభివృద్ధికి, సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు వినియోగించాలని కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ దివాకరబాబు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి. కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు

ఉంగుటూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : తుఫాను ప్రభావంతో కురిసిన భారీవర్షాలకు గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా మెరుగైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆత్కూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు అన్నారు. స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్కూరులో పారిశుధ్యం మెరుగుదలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బందితో డ్రైయినేజీల్లో పూడికతీయించడంతోపాటు చెత్తాచెదారాన్ని తొలగించి, గ్రామం మొత్తం బ్లీచింగ్ చల్లించే పనులను సర్పంచ్ భూతపాటి ఎస్తేరమ్మతో కలిసి స్వయంగా పర్యవేక్షించారు. పంచాయతీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.





పెనమలూరు, ఉయ్యూరులో నిత్యావసరాలు పంపిణీలో నాయకులు

తుఫాను బాధితులకు ప్రభుత్వ సాయం

పెనమలూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గత ఆరు రోజులుగా తుఫాను ప్రభావంతో పునరావాస కేంద్రాలకు తరలించిన పెనమలూరు గ్రామానికి చెందిన 29 కుటుంబాలకు శుక్రవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు గోపాలకృష్ణ, టీడీపీ కూటమి నేతలు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉయ్యూరు : మొంథా తుపాను బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెనుకాడేది లేదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఉయ్యూరు 15వ వార్డులో తుపాను బాధితులకు నిత్యావసర సరుకులు శుక్రవారం అందజేశారు. మున్సిపల్ చైర్మన్ వి.సత్యనారా యణ, పీఏసీఎస్ అధ్యక్షుడు వాసు, కొండ, తదితరులు పాల్గొన్నారు. రాజర్షినగర్‌లో నిత్యావసరాలను తహసీల్దార్ సురేశ్‌కుమార్, చైర్మన్ సత్యనారాయణ పంపిణీ చేశారు.



బాపులపాడులో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : మొంథా తుఫాన్ ధాటికి నిరాశ్రయులైన వారికి ప్రభుత్వం అండగా నిలవడంతో పాటు తక్షణసాయంగా నిత్యావసరాలు, నగదు సహాయం అందించడం కూటమి ప్రభుత్వం వల్లే సాధ్యమయిందని రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు, ఎస్‌ఎస్ ఎల్సీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. బాపులపాడు మండలంలోని పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని తహసీల్దార్ మురళీకృష్ణతో కలిసి టీడీపీ నాయకులు పంపిణీ చేశారు.

విజయవాడ రూరల్ : తుపాను బాధితులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ సుగుణ అన్నారు. మొంథా తుపాను కారణంగా పునరావాస కేంద్రంలో ఉన్న బాధిత కుటుంబాలకు శుక్రవారం బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. స్థానిక నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిత్యావసర సరుకులు, రూ. 3 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గోడ్డళ్ల చిన్నరామారావు, కలకోటి శ్రీనివాసరెడ్డి, గంపా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : తుపాను వల్ల నష్టపోయిన కుటుంబాలకు సహాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఏఎంసీ వైస్‌చైర్మన్ కొండేటి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కుందేటి చంద్రశేఖర్ అన్నారు. మండలంలో పెదఅవుటపల్లి, మానికొండ, తేలప్రోలు, ఆత్కూరు, వేంపాడు, నందమూరు పునరావాస కేంద్రాలలో తలదాచుకున్న బాధిత కుటుంబాలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు.

సర్పంచ్‌గా భాస్కరరావు కొనసాగింపు

పెనమలూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పెనమలూరు సర్పంచ్‌గా లింగాల భాస్కరరావును కొనసాగించమని ప్రభుత్వం శుక్రవారం ఉత్వర్వులు జారీ చేసింది. గతంలో ఇరిగేషన్ భూమిలో అనుమతులు లేకుండా రోడ్డును నిర్మించారన్న ఆరోపణలతో భాస్కరరావును ప్రభుత్వం పదవి నుంచి తొలిగించిన విషయం తెలిసిందే. భాస్కరరావు అభ్యర్థన మేరకు నిధుల దుర్వినియోగంపై మళ్లీ విచారణ చేయమని, సర్పంచ్‌గా కొనసాగించమని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

తేలప్రోలులో జపమాల మాత పండుగ

ఉంగుటూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మరియ మాత మధ్యస్థ ప్రార్థనలద్వారా ఏసుక్రీస్తు ప్రజలకు అనేక మేలులు చేశారని ఫాదర్ గోళ్ల విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని తేలప్రోలులో శుక్రవారం జపమాల మాత పండుగను క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మేరీమాతను స్మరించుకుంటూ, ఆమె స్వరూపాన్ని గ్రామపురవీధులలో ప్రదక్షిణ చేసే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం జపమాలను జపిస్తూ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కష్టాల్లో తోడుగా వుండమని మరియతల్లిని వేడుకున్నారు.

పురమిత్ర యాప్ ద్వారా పన్ను చెల్లించవచ్చు

ఉయ్యూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పురమిత్ర యాప్ ద్వారా వినియోగదారులు ఆస్తిపన్ను చెల్లింపుతో పాటు ఫిర్యాదుల నమోదు చేయవచ్చని ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు తెలిపారు. పట్టణ పరిధిలో పురపాలక సేవలు సులభతరం చేసేందుకు ప్రభుత్వం పురమిత్ర యాప్ అందు బాటులోకి తెచ్చిందని, ఆస్తిపన్ను చెల్లింపు ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, నీటి సరఫరా, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదులతో పాటు పట్టణ ప్రణాళిక సబంధిత సేవలు పొందవచ్చని, ఈ యాప్ తెలుగులో అందుబాటులో ఉందని, ఫిర్యాదుల పరిష్కారం కోసం ఫోటోలు అప్‌లోడ్ చేయవచ్చని తెలిపారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

ప్రసాదంపాడు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని కెఎల్‌యూ అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం నిడమానూరులోని శ్రీచైతన్య మయూరి రామన్ భవన్ 3, 4లో కెఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మన దేశం, మనరాష్ట్రం, మన ఆవిష్కరణలు అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధికి యువత శక్తి మేధస్సే మూలాధారమని, దేశం అభివృద్ధి రాష్ట్ర పురోగతి, యువత ఆవిష్కరణాత్మక ఆలోచన మీదే ఆధారపడి ఉంటుంద న్నారు. కార్యక్రమంలో శ్రీచైతన్య జూనియర్ కళాశాల ఎగ్జిక్యూటివ్ డీన్ శరత్, కెఎల్‌యూ అసిస్టెంట్ డైరెక్టర్‌లు బొబ్బిలి సత్యనారాయణ, షణ్ముఖ్ పాల్గొన్నారు.

మహనీయుడు వల్లభాయ్ పటేల్



గన్నవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని ఒకటిగా చేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్‌పటేల్ అని బీజేపీ సీనియర్ నాయకులు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నీలం అశోక్ ఆధ్వర్యంలో ఉక్కుమనిషి వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏఎంసీ డైరెక్టర్ కానూరు శేషుమాధవి, నాదిండ్ల మోహన్, కురుమద్దాల ఫణి కుమార్, వెంకట కృష్ణ, మేడూరి శేషుబాబు, వెంకటేశ్వరరెడ్డి, దుర్గారావు, ప్రసాద్, చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

సిద్ధార్థ వర్సిటీలో ఐక్యతా మార్చ్



కానూరు : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకొని శుక్రవారం కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఐక్యతా మార్చ్ జరి గింది. వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలను, దేశ ఐక్యత కోసం చేసిన కృషిని స్మరించుకున్నారు. కార్యక్రమంలో వర్సిటీ డిప్యూటీ రిజిస్ట్రార్ సాయిబాబు, డాక్టర్ జే. శివరాంప్రసాద్, డాక్టర్ పి. సుష్మాచౌదరి, పి. మాధవి, పి. కేశవరావు, వేణుగోపాల్, బేబీరాణి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్: వల్లభాయ్ పటేల్ జయంతి స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి మారుబోయిన కోటేశ్వరరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు, డైరకర్లు పాల్గొన్నారు.మండల పరిషత్ కార్యాలయంలో పటేల్ జయంతిని నిర్వహించారు. ఎంపీడీవో జోగేశ్వరరావు పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

విజయవాడ రూరల్ : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి నున్న పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఘనంగా జరిగింది. మానసిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ తహసీల్దార్ సుగుణ పాల్గొని పటేల్ త్యాగనిరతిని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పి.యుగంధర్

దోమల నివారణ చర్యలు చేపట్టాలి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : తుపాను ప్రభావిత ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండే చోట దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని కృష్ణాజిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి. యుగంధర్ పేర్కొన్నారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్లతో జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. డీఎంహెచ్‌వో యుగంధర్ మాట్లాడుతూ, గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. నీటి ట్యాంకర్లను శుభ్రం చేయాలన్నారు. ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు ఉదయం 9 గంటలకు, సాయంత్రం 4 గంటలకు ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు నమోదు చేసుకోవాలన్నారు. మాతా శిశు సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మాతృ, శిశు మరణాలు సంభవించకుండా చూడాలన్నారు. పుట్టిన బిడ్డలకు దశల వారీ టీకాలు వేయాలన్నారు.

ఎంటీపీ రిజిస్ట్రేషన్ లేకుండా అబార్షన్ చేస్తే చర్యలు

● ఎన్టీఆర్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని

విజయవాడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేని ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు గర్భిణులకు అబార్షన్ నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రులు, నర్సింగ్ హోంలు తప్పనిసరిగా మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటీపీ) చట్టపరిధిలో రిజిస్టర్ అయ్యుండాలని, అదే విధంగా రిజిస్టర్ అయిన ఆసుపత్రులు కాలపరిమితి ముగుస్తున్న సందర్భంగా రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయించుకోవాలని తెలిపారు. సంబంధిత రిజిస్టర్‌లు, నివేదికలు నిర్వహణ చేయడంతో పాటు ప్రతి నెలా జరిగిన అబార్షన్‌ల వివరాల జాబితాను డీఎంహెచ్‌వో ఆఫీసుకు స మర్పించాలన్నారు. అబార్షన్ చేయించుకోవాలనుకునే గర్భిణులు కూడా ఎంటీపీ చట్టం పరిధిలో రిజిస్టర్ అయిన ఆసుపత్రులకు మాత్రమే వెళ్లాలన్నారు.



చోడవరంలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మాధవ్

రైతులు, మత్స్యకారులను ఆదుకుంటాం : మాధవ్

పెనమలూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులు, మత్స్యకారులను పూర్తిస్థాయిలో ఆదుకుంటామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. పెదపులిపాక, చోడవరంలో శుక్రవారం ఆయన పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పెదపులిపాకలోని వల్లూరు శ్రీమన్నారాయణ గృహంలో మాధవ్ విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రైతులను ఆదుకుంటామన్నారు. కూటమి నేతలు గోపిశెట్టి దుర్గాప్రసాద్, యేకుల విజయేంద్ర, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, కలపాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ రెక్టార్ బసవేశ్వరరావుకు శిక్షక్ సమ్మాన్ అవార్డు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : కృష్ణావిశ్వవిద్యాలయం రెక్టార్ ఎం.వి.బసవేశ్వరరావుకు ప్రతిష్టాత్మకమైన శిక్షక్ సమ్మాన్ అవార్డును శుక్రవారం ఢిల్లీలో అందుకున్నారు. ఎఫ్‌డబ్ల్యుఏ అకడమిక్ వార్షికోత్సవంలో బసవేశ్వరరావుకు ఈ అవార్డును కేంద్ర మాజీ మంత్రి పద్మభూషణ్ డాక్టర్ మురళీ మనోహర్ జోషి అందజేశారు. ఎఫ్‌డబ్ల్యుఏ అధ్యక్షుడు రిజ్వీ తదితరులు పాల్గొన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో విశేష సేవలందిస్తున్నందుకు బసవేశ్వరరావుకు ఈ అవార్డును అందజేశారు. వివిధ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, డైరక్టర్లు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



మురళీ మనోహర్ జోషి నుంచి అవార్డు అందుకుంటున్న బసవేశ్వరరావు



వైద్యవిద్యలో నూతన ఒరవడి

● తొలి హెల్త్ యూనివర్సిటీ ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం
● ఉన్నత ప్రమాణాల వైద్యులనందించడంలో ఘనత
● నేడు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ స్నాతకోత్సవం

జీవనశైలిలో చోటుచేసుకున్న అనూహ్య మార్పులతో కొత్త రోగాలు, వైరస్‌లు వస్తున్న నేపథ్యంలో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించే నిపుణులైన వైద్యులు చాలా అవసరం. వైద్యవిద్యా రంగంలో ప్రపంచ ధోరణులను అన్వయించుకుంటూ ఆధునిక వైద్యశాస్త్రం బాటలో విద్యార్థులను తీర్చిదిద్దితేనే నేడు వైద్య రంగంలో రాణించగలరు. అధికశాతం మంది వైద్యవిద్యనభ్యసిస్తున్నా, ఎంత మంది నాణ్యమైన వైద్యులుగా బయటకు వస్తున్నారనేది ప్రశ్నార్థకం. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొంటూ ఉన్నత ప్రమాణాల వైద్య విద్య నందిస్తున్న ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ స్నాతకోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

విజయవాడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ కేంద్రంగా 1986లో ఎన్టీఆర్ యూనివర్సిటీని స్థాపించారు. 1998లో దీనికి డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ అని పేరు మార్చారు. 19 ఏళ్ల విద్యా ప్రయాణంలో అనేక అత్యుత్తమ ఫలితాలు సాధించిన యూనివర్సిటీ ద్వారా పట్టభద్రులైన వేలాది మంది డాక్టర్లు దేశ, విదేశాల్లో వైద్య సేవలందిస్తున్నారు.

దేశంలోనే మొదటి సారిగా స్థాపించిన వైద్య విశ్వవిద్యాలయంగా ఎన్టీఆర్ యూనివర్సిటీ గుర్తింపు పొందింది. ప్రస్తుతం యూనివర్సిటీ పరిధిలో 356 అనుబంధ కాలేజీలు ఉన్నాయి. యూనివర్సిటీలో చదువున్న వారిలో అధిక శాతం మంది విదేశాల్లో స్థిరపడ్డారు. ఇక్కడి విద్యనభ్యసించి, ఉన్నత స్థాయిలో స్థిరపడిన వైద్యులు ఎందరో ఉన్నారు. ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం నాణ్యమైన వైద్యులను తయారుచేసే ఫ్యాక్టరీగా మారిందని కొందరు నిపుణులు చెబుతున్నారు. అండర్ గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్, సూపర్ స్పెషాలిటీ, డాక్టోరల్, డెంటిస్ట్రీ, పీహెచ్‌డీ వంటి 129 కోర్సులు యూనివర్సిటీ అనుబంధ కాలేజీల ద్వారా కొనసాగుతున్నాయి. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎంఎస్, బీయూఎంఎస్, ఎంఎస్, ఎండీఎస్, ఆప్టోమెట్రీ వంటి కోర్సులకు తోడు నర్సింగ్, ఆయుర్వేదం వంటి ప్రత్యామ్నాయ మెడికల్ కోర్సులు కూడా అందిస్తున్నారు. యూనివర్సిటీ యూజీసీ, ఐఎన్‌సీ, సీసీహెచ్, సీసీఐఎం, ఎంసీఐ వంటి జాతీయ సంస్థల గుర్తింపు పొందింది. ఈ క్రమంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో వైద్య విద్యను అందించే దిశగా యూనివర్సిటీ కృషి చేస్తోంది. ఆరోగ్య పరిరక్షణ విషయమై ఆధునిక సమాజంలో చైతన్యం పెరుగుతుండగా, వైద్య విద్యార్థులు కూడా చికిత్సా నైపుణ్యాన్ని



మెరుగుపరుచుకునే దిశగా కృషి చేస్తున్నారు. వైద్య విద్యలో నాణ్యతాప్రమాణాలను మరింత మెరుగుపరడమే లక్ష్యంగా యూనివర్సిటీ కొత్త కార్యనిర్వాహక మండలిని ఏర్పాటు చేసింది. రాబోయే కాలంలో ప్రతి సంవత్సరం స్నాతకోత్సవం నిర్వహిస్తూ వైద్య విద్యా రంగంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే యోచనలో యూనివర్సిటీ ఉన్నట్టు సమాచారం.

విద్యార్థుల్లో సేవా దృక్పథం పెంపొందించడమే లక్ష్యం



విద్యార్థుల్లో సేవా దృక్పథం, నిబద్ధత, నిజాయితీ, అంకిత భావం పెంపొందించడానికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జాతీయ, అంతర్జాతీయ వైద్య దినోత్సవాల సం దర్భంగా అవగాహన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. యూనివర్సిటీ 27, 28వ స్నాతకోత్సవాలు శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉదయం 11.30 గంటల నుంచి నిర్వహిస్తున్నాం. 2021, 2022 స్నాతకోత్సవాల్లో 120 మంది విద్యార్థులకు 156 పతకాలు, 38 మందికి నగదు బహుమతులు, ఐదుగురికి పీహెచ్‌డీ పట్టాలు, సూపర్ స్పెషాలిటీలో ఢిల్లీ నేషనల్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్ చీఫ్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ ఓపీ యాదవ్‌కు డాక్టరేట్ ప్రదానం చేస్తున్నాం. గవర్నర్, యూనివర్సిటీ చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహిస్తారు.

- డాక్టర్ పి.చంద్రశేఖర్, వైస్ చాన్సలర్

కష్టం మింగేస్తున్నారు!

● జీజీహెచ్ సెక్యూరిటీ ఆవేదన
● మూడు నెలలుగా వేతనం చెల్లించని కాంట్రాక్టు సంస్థ

● వారాంతపు సెలవులకూ జీతం కట్ ● అడిగితే బెదిరింపులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేసే సెక్యూరిటీ సిబ్బందికి ఇచ్చే వేతనంలో కాంట్రాక్టరు చేతివాటం ప్రదర్శిస్తున్నాడు. కాంట్రాక్టు సంస్థ ఒప్పందం ప్రకారం జీజీహెచ్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ సూపర్‌వైజర్, గార్డులకు వేతనాలు ఇవ్వాల్సి ఉంది. సెక్యూరిటీ వేతనంలో కోత విధించడంతో పాటు వారాంతపు సెలవులకు జీతం కట్ చేయడంతో పాత, కొత్త జీజీహెచ్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు నెలల కిందట విజయవాడ కొత్త, పాత ప్రభుత్వ ఆసుపత్రి, సిద్ధార్థ మెడికల్ కాలేజీ, దంత వైద్య కళాశాల, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో మొత్తం 200 మంది సెక్యూరిటీ సిబ్బందితో అజైల్ సంస్థ ద్వారా విధులు నిర్వహించే వారు. కాంట్రాక్టరు గడువు ముగియడంతో తర్వాత రక్షక్ సెక్యూరిటీ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. కొత్త సంస్థ మేలో బాధ్యతలు స్వీకరించిన మొదటి రెండు నెలలు జీతాలు చెల్లించలేదు. దీనిపై కాంట్రాక్టరును ప్రశ్నించగా కొత్తగా కాంట్రాక్టు దక్కించుకున్నామని, అకౌంట్ బదిలీల్లో అంతరాయం ఏర్పడడంతో జీతాల చెల్లింపులో జాప్యం జరిగిందని సమాధానమిచ్చారు. రెండు నెలల జీతం ఒకేసారి వేసినప్పటికీ ఒప్పందం ఒప్పందం ప్రకారం ఇవ్వలేదు. సిబ్బంది ప్రశ్నించకపోవడంతో మళ్లీ కాంట్రాక్టరు మిన్నకుండిపోయాడు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల వేతనాలు వేయడంలో మళ్లీ అదే నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాడు. మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సెక్యూరిటీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి లేదని సెక్యూరిటీ సిబ్బంది వాపోయారు.



లేబర్ యాక్ట్ ప్రకారం నెల జీతానికి పని చేస్తున్న ప్రతి కార్మికుడికి వేతనంతో కూడిన వారాంతపు సెల వు తప్పనిసరిగా ఇవ్వాలి. ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి మాత్రం కాంట్రాక్టరు వారాంతపు సెలవులకు వేతనంలో కోత విధిస్తున్నట్టు తెలిసింది. ఒప్పందం ప్రకారం సెక్యూరిటీ వ్యవస్థలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న వారికి రూ.18,500 వేతనం నిర్ణయించగా పీఎఫ్ కట్‌చేసి రూ.16,100 ఇవ్వాలి. వారాంతపు సెలవుల్లో(వీక్లీ ఆఫ్) కోత విధిస్తూ కేవలం రూ.13,900 మాత్రమే కాంట్రాక్టు సంస్థ ఇస్తోంది. గార్డులకు మొత్తం రూ.16 వేలు నిర్ణయించగా రూ.14,100 ఇవ్వాలి. కానీ రూ.12,100 మాత్రమే ఇస్తున్నారు. గతంలో శానిటేషన్, సెక్యూటరికీ ఒకరే కాంట్రాక్టురు. దీనితో సెక్యూరిటీ సూపర్‌వైజర్‌కు రూ.16,200, గార్డుకు రూ.13,900 ఇచ్చేవారు. కొత్తగా వచ్చిన కాంట్రాక్టు సంస్థ ఇందుకు విరుద్ధంగా చిరుద్యోగుల జీతాల్లో కోతలు విధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తోంది. సిబ్బంది ఎవరైనా అడగితే ఇంతే ఇస్తాం, నచ్చితే చేయండి.. లేకపోతే మానేయండి అని కాంట్రాక్టరు దురుసుగా సమాధానమిస్తున్నారని సెక్యూరిటీ సిబ్బందివాపోయారు. తమకు వచ్చే అరకొర జీతంలో కోతలు విధించడంతో పాటు రెండు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఇల్లు గడవడం కూ డా కష్టంగా ఉందని తమ కష్టాలను చెప్పుకొచ్చారు. ఇంతకుముందు అధికారుల చొరవతో రెండు నెలల జీతం ఒకేసారి చెల్లించారని, మళ్లీ అప్పటి నుంచి జీతం వేయలేదని తమ ఆవేదనను చెప్పుకొచ్చారు.

నోటీసులిచ్చాం

ఆసుపత్రి అధికారులను వివరణ కోరగా, కాంట్రాక్టరు సిబ్బంది వేతనాల్లో కోత విధిస్తుడడంతో పాటు, వారాంతపు సెలవులకు జీతం కట్ చేస్తున్నట్టు తెలియడంతో సంస్థకు ఇప్పటికే నోటీసులు ఇచ్చినట్టు తెలిపారు. మొదటి రెండు నెలల వేతనాలు ఒప్పందం మేరకు చెల్లించకపోవడంతో బిల్లులు పెండింగ్‌లో పెట్టినట్టు అధికారులు చెప్పారు. తాము బిల్లులు పెండింగ్‌లో ఉంచినప్పటికీ ప్రతి నెలా సిబ్బందికి జీతాలు వేయాల్సిన బాధ్యత కంట్రాక్టరుకు ఉందని, ఇప్పటికే ఈ విషయంపైనా కాంట్రాక్టురును హెచ్చరించినట్టు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

పాక్షికంగా దెబ్బతిన్న పాఠశాలలు 159

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను కారణంగా కృష్ణాజిల్లాలో 159 పాఠశాలలు పాక్షికంగా దెబ్బతిన్నట్టు డీఈవో పి.వి.జె. రామారావు తెలిపారు. నష్టాన్ని వివిధ మండలాల ఇంజనీర్లు భేరీజు వేస్తున్నట్టు తెలిపారు. బీయిడీ విద్యార్థుల 4వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదలైనట్టు డీఈవో తెలిపారు. రీ కౌంటింగ్‌కు నవంబరు 8లోగా నిర్ణీత ఫీజు చెల్లించి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో పేర్కొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు 3న

కానూరు, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ సెలక్షన్స్ పెనమలూరు సాలిపేటలో నవంబరు 3వ తేదీన నిర్వహిస్తున్నట్లు కృష్ణా డిస్ట్రిక్ట్ వెయిల్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గుర్రాల రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ సెలక్షన్స్‌లో పాల్గొనే క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు, ఐడబ్ల్యూఎఫ్ కార్డు, రెండు ఫొటోలు, పుట్టిన రోజు సర్టిఫికెట్ తీసుకురావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు నవంబరు 14 నుంచి 16వ తేదీ వరకు విజయనగరం జిల్లా కొండావేళగాడులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9246400489 నెంబరును సంప్రదించాలని రవి కోరారు.



ఏక్తార్యాలీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ కేశినేని శివనాథ్



ఏక్తా ర్యాలీలో సీపీ రాజశేఖరబాబు, డీసీపీలు సరిత



ఏక్తాదివస్‌లో సాంస్కృతిక ప్రదర్శన

సమైక్యతా స్ఫూర్తిప్రదాత సర్దార్ పటేల్

● విజయవాడలోని ఏక్తా దివస్‌లో వక్తల ఉద్ఘాటన

విజయవాడ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏక్తా ర్యాలీ ఉత్సాహంగా సాగింది. విజయవాడ ఎంజీ రోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద శుక్రవారం ర్యాలీని ఎంపీ కేశినేని చిన్ని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రారంభించారు. వల్లభాయ్ పటేల్ దేశరక్షణ, సమగ్రత కోసం ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు, నాయకులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విశాల భారతావనిని ఏకతాటిపై నడిపించిన ఆయన జీవితం ఆదర్శప్రాయమన్నారు. బ్రిటీష్ వారు భారత్‌ను విడిచి వెళ్లాక దేశరక్షణ, సమగ్రత కోసం ఆయన ఎంతో కృషి చేశారన్నారు. టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, మైనా ర్టీ సెల్ అధ్యక్షుడు కరీముల్లా, బీజేపీ నేతలు అడ్డూరి శ్రీరామ్, సాదినేని యామిని, ఉప్పలపాటి శ్రీనివాస్‌రాజు పాల్గొన్నారు. **విజయవాడ సిటీ:** ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏక్తా ర్యాలీని నిర్వహించారు. ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడి యం వద్ద నుంచి సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. సీపీ ఎస్వీ రాజశేఖరబాబు, డీసీపీలు సరిత, తిరుమలేశ్వరరెడ్డి, ఉదయరాణి, ఏడీసీపీలు, ఏసీపీలు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమాన్ని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) కె.జి.వి.సరిత పూలమాల వేసి నివాళులర్పించారు. దేశాన్ని ఏకీకరణ చేసిన వల్లభాయ్ పటేల్ సేవలను స్మరించుకున్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని రాష్ట్రీయ ఏక్తాదివస్‌ను పండుగలా జరుపుకుంటున్నామని డీసీపీ వివరించారు.



పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ

విజయవాడ సిటీ : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని ఎన్టీఆర్ ఎన్టీఆర్ జిల్లా పోలీస్ యంత్రాంగా శుక్రవారం రాత్రి ఎంజీ రోడ్డులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించింది. డీ అడ్రస్ మాల్ నుంచి వ్యాస్ క్యాప్లెక్స్ వరకు వీరి ర్యాలీ కొనసాగింది. తొలుత విద్యార్థులతో కలిసి పోలీసులు మానవహా రంగా ఏర్పడ్డారు. అరాచక శక్తులను అణచివేసే క్రమంలో ప్రాణాలర్పించిన పోలీసులను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు, డీసీపీలు కె.జి.వి.సరిత, తిరుమలేశ్వరరెడ్డి, ఉదయరాణి, ఎస్.వి.డి.ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ డిజిటల్ ఐడీ అప్‌డేట్ చేసుకోవాలి

● కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

విజయవాడ సిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ డిజిటల్ ఐడీలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎన్టీఆర్ కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. అమరావతి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యాన కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశపు మందిరంలో శుక్రవారం జర్నలిస్ట్ కుటుంబాల ఆధార్ మేళాను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. నిత్యం పని ఒత్తిడితో ఉండే జర్నలిస్ట్‌ల సంక్షేమ కోరుతూ ఆధార్ మేళాను నిర్వహించిన అమరావతిప్రెస్ క్లబ్ ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. సామాజిక భద్రత కోసం డిజిటల్ ఐడీలు అవసరం ఉంటుందన్నారు. ఆధార్‌లో తప్పులు ఉంటే ప్రభుత్వ పథకాలు నిలిచిపోతాయని, పాస్‌పోర్ట్ మంజూరు కాదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఈ ఆధార్ మేళా కార్యక్రమంలోనే జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా తన ఆధార్‌ను అప్‌డేట్ చేసుకున్నారు. మొత్తం 51 మంది జర్నలిస్టులు కుటుంబ సభ్యులతోఆధార్ మేళాను సద్వినియోగం చేసుకున్నట్లు అమరావతి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రెడ్డెం అప్పాజీ, ప్రధాన కార్యదర్శి సి.సతీష్‌బాబు, కోశాధికారి పూర్ణచంద్రరావు, ఉపాధ్యక్షుడు జి.వి.నారాయణ, కమిటీ సభ్యులు శ్యామ్‌సుందర్, మల్లేశ్వరరావు, మహేష్ తెలిపారు.



ఆధార్ అప్‌డేట్ చేయించుకుంటున్న జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా



మాట్లాడుతున్న పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, కలెక్టర్ లక్ష్మీశ

అంబేడ్కర్ స్మృతివనం...బెజవాడ మణిహారం

● పర్యాటకులకు మధురానుభూతులు మిగిల్చేలా అభివృద్ధి పనులు
● సమష్టి కృషి, సమన్వయంతో అభివృద్ధిలో భాగస్వాములవుదాం
● రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్

కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం (సామాజిక న్యాయ మహాశిల్పం) విజయవాడ నగర పర్యాటకానికి మణిహారమని, పర్యాటకులకు మరింత మధురానుభూతులు మిగిల్చేలా అభివృద్ధిపనులు చేపడుతున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఏపీఎస్ రెడ్డి హాల్‌లో కలెక్టర్ లక్ష్మీశ, సాంఘిక సంక్షేమ శాఖ డైరక్టర్ బి.లావణ్యవేణి, భాషా సాంస్కృతిక శాఖ డైరక్టర్ ఆర్.మల్లిఖార్జునరావు తదితరులతో కలిసి విజయవాడ నగరపాలక సంస్థ, ఏపీఐఐసీ, సాంస్కృతిక, సాంఘిక సంక్షేమ సమన్వయ శాఖల అధికారుల అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అజయ్‌జైన్ ప్రస్తుతం స్మృతివనాన్ని సందర్శిస్తున్న పర్యాటకులు, అక్కడి సౌకర్యాలు, వనరుల సమర్థ వినియోగం తదితరాలపై సమావేశంలో చర్చించారు అజయ్‌జైన్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం నగర పర్యాటక ప్రాంతాల జాబితాలో ముందు వరుసలో ఉండాలన్నారు. నగరానికి వచ్చే ప్రతిఒక్కరూ స్మృతి వనాన్ని సందర్శించేలా, మహనీయుని ఆశయాల స్ఫూర్తిని, విజ్ఞాన వీచికలను భావితరాలకు అందించేలా అవగాహన కల్పించాలని సూచించారు.

గుజరాత్ రాష్ట్రంలో నర్మదా జిల్లాలోని ఏక్తా నగర్ స్టాట్యూ ఆఫ్ యూనిటీ, వివిధ రాష్ట్రాల్లోని మహనీయుల స్మారక ప్రాంతాల తరహాలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతివనం మరింత అభివృద్ధికి చేస్తున్న ప్రయత్నాల్లో సమన్వయ శాఖల అధికారులు ఒక బృందంగా కీలకపాత్ర పోషించాలని సూచించారు. ఇందుకు అందుబాటులో వున్న వనరులను సమర్థవంతంగా వినియోగించడం ముఖ్యమని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఉపయోగించుకోవాల్సి వుందన్నారు. పర్యాటకులకు ప్రస్తుతం ఉన్న సౌకర్యాలతో పాటు చిన్నారుల ఆట స్థలం, ఆడిటోరియం, ఎక్స్‌పీరియన్స్ సెంటర్, మ్యూజియం తదితరాలకు సంబంధించిన అభివృద్ధి పనులను పటిష్ట ప్రణాళికతో త్వరితగతిన పూర్తిచేయాల్సిన అవసరముందన్నారు. ఇందుకు అవసరమైన టెండర్ల ప్రక్రియను చేపట్టి, నియమనిబంధనలకు అనుగుణంగా పూర్తిచేయాలన్నారు.

ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వైబ్రెంట్ విజయవాడతో పాటు జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతివనాన్ని భాగస్వామ్య పక్షాల సూచనలు మేరకు మరింత అభివృద్ధి చేసేందుకు, నిర్వహణపరంగా లోటుపాట్లు లేకుండా చూసేందుకు చొరవ చూపుతున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ అబ్దుల్ రహీం, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎం.రమాదేవి, కేపీసీ ప్రాజెక్ట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

లక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు

గుడివాడ రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): చిన్న ఎరుకపాడులోని అష్టలక్ష్మీ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి లక్ష్మీ అలంకరణ చేశారు. ఆలయ ట్రస్టీ ఛైర్మన్ బొప్పూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చన, హారతులు ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



చిన ఎరుకపాడులో లక్ష్మీ అమ్మవారుగా దర్శనం

నిరాశ్రయులకు నిత్యావసరాల పంపిణీ



పెదపారుపూడిలో..

పెదపారుపూడి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను బాధిత కుటుంబాలకు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా నిత్యావసర సరుకులను అందజేశారు. వెంట్రప్రగడలో శుక్రవారం బాధిత కుటుంబాలకు 25 కిలోల బియ్యం, పంచదార, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, కిలోవంతున, ఒక లీటర్ మంచి నూనె ప్యాకెట్ వంతున అందజేశారు. రాష్ట్ర గౌడ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, తహసీల్దార్ డి.శ్రీను నాయక్, ఎండీవో జె.విమాదేవి, డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వో ఫణికుమార్, కార్యదర్శి సాగర్ రాణి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో..

గుడివాడ : సీఎం చంద్రబాబు ముందుచూపు, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నిరంతర పర్యవేక్షణ, అధికారుల ముందస్తు చర్యలతో గుడివాడలో మెరుగైన పరిస్థితులు నెలకొన్నాయని ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాస రావు అన్నారు. మొంథా తుఫాను బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత నిత్యావసర సరుకులను శుక్రవారం అందజేశారు. ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మొంథా తుఫాను వేళ గుడివాడ డివిజన్ పరిధిలో ఏడు మండలాల్లో 35పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి, 1966మంది బాధితులకు ప్రభుత్వం అందజేసిన నిత్యావసరాల కిట్లను అందిస్తున్నామన్నారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, కూటమి నాయకులు



నందివాడలో..

వెనిగండ్ల రామకృష్ణ(నాని), చేకూరు జగన్మోహనరావు, గోకవరపు సునీల్, మజ్జాడ నాగరాజు, పండ్రాజు సాంబశివరావు, లింగం ప్రసాద్, వాసే మురళీ, చాట్రగడ్డ రవి పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : మండలంలో తుఫాన్ పునరావాస కేంద్రాల్లో తలదాచుకొన్న నిరాశ్రయులైన 238 కుటుంబాలకు శుక్రవారం రేషన్ పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంవద్ద బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీని టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి, గుడివాడ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్‌ల చేతుల మీదుగా గుడ్లవల్లేరు, కౌతవరం గ్రామాలకు చెందిన 150 కుటుంబాలకు పంపిణీ చేశారు. కౌతవరం డీసీ ఛైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యేశ్వరచౌదరి, కొడాలి రామరాజు, అట్లూరి స్వరూప్, జగన్మోహనరావు, వెనిగళ్ల రామకృష్ణ, కొండాలమ్మ తల్లి దేవస్థాన ఛైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహన్, జగన్మోహనరావు, గుడ్లవల్లేరు పీఏసీఎస్ ఛైర్మన్ యెనిగళ్ల నాగేశ్వరరావు, శేరికల్వపూడి పీఏసీఎస్ ఛైర్మన్ అట్లూరి శ్రీరామచంద్ర ప్రసాద్, డీసీ వైస్‌ఛైర్మన్ శ్రీధర్ పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : లింగవరం సచివాలయ కార్యాలయం వద్ద అధికారులు, కూటమి నాయకులు తుఫాను



గుడివాడ రూరల్‌లో..

బాధితులైన 20 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. 25 కేజీల బియ్యం, కిలో కందిపప్పు, లీటర్ పామాయిల్, పంచదార, ఉల్లిపాయలతో కూడిన బ్యాగ్‌ను తుఫాన్ బాధితులకు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ స్టేడియం వైస్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడి వాడ మార్కెట్ యార్డు ఛైర్మన్ రవికుమార్, వెనిగండ్ల రామకృష్ణ, ఎంపీడీవో విష్ణుప్రసాద్, తహసీల్దార్ కిరణ్, కార్యదర్శి అనుల పాల్గొన్నారు.

కూచిపూడి : మొవ్వలోని ఏడు పునరావాస కేంద్రాల్లో 277 కుటుంబాల వారు ఆశ్రయం పొందినట్లు తహసీల్దార్ కె.మస్తాన్ తెలిపారు. మొవ్వలో 50 కుటుంబాల వారు, పెదపూడిలో 43, చినముత్తేవిలో 17, నిడుమోలులో 108, కాజలో 41, భట్లపెనుమర్రులో 18 కుటుంబాల వారు ఆశ్రయం పొందారు. వారికి కుటుంబానికి రూ.3 వేలు చొప్పున రూ.6,05,000లను వారి బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నట్టు తహసీల్దార్ తెలియజేస్తూ 25 కిలోల బియ్యం, కందిపప్పు, బంగాళదుంపలు, పామోలిన్ ఆయిల్, పంచదార, ఉల్లిపాయలు కిలో చొప్పున శుక్రవారం సాయంత్రానికి బాధిత కుటుంబాలకు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

పామర్రు : తుఫాన్ ప్రభావంతో పామర్రు జడ్పీ హైస్కూల్లో విడిది పొందిన బాధిత కుటుంబాలకు శుక్రవారం



గుడివాడలో..

ప్రభుత్వం అందించిన రెమ్యూనరేషన్‌తోపాటుగా, నిత్యవసర వస్తువులను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మండపాక శంకర్ బాబు, తదితర నాయకులు పంపిణీ చేశారు.

నందివాడ : మొంథా తుఫాను సందర్భంగా మండలంలో ఏర్పాటు చేసిన 5 పునరావాస కేంద్రాల్లో 163 కుటుంబాలు 279 మంది వరద బాధితులకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న బియ్యం, పంచదార, నిత్యావసర కిట్లను తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి కూటమి నాయకులు ఆధ్వర్యంలో శుక్రవారం నందివాడలో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడివాడ మార్కెట్ యార్డు



పామర్రులో..

ఛైర్మన్ చాట్రగడ్డ రవి, మండల టీడీపీ అధ్యక్షులు దానేటి సన్యాసిరావులు వరద బాధితులకు పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రతీ ఒక్క రేషన్ కార్డుదారులకు 3 వేలు డబ్బులు, 25 కేజీల బియ్యం, కిలో కందిపప్పు, లీటరు పామాయిల్, పంచదార, ఉల్లిపాయలు, బంగాళదుంపలు ఇలా ఆరు నిత్యావసర సరుకుల కిట్లను బాధితులకు అందించారు. ఆర్ఐ గణేష్, సీతయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : తహసీల్దార్ కార్యాలయం వద్ద తుఫాను బాధితులకు శుక్రవారం నిత్యావసర కిట్‌లను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా లాంచనంగా ప్రారంభించారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, తహసీల్దార్ ఎం కుసుమకుమారి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో..



చినగొన్నూరులో పడిపోయిన వరిచేలను పరిశీలిస్తున్న శాయిన దంపతులు

దెబ్బతిన్న వరి పొలాల పరిశీలన

గుడ్లవల్లేరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : చిన గొన్నూరు ప్రాంతంలో 562 ఎకరాల వరిచేలు మొంథా తుపాను కారణంగా పూర్తిగా పడిపోయాయని జిల్లాపరిషత్ మాజీ వైస్‌ఛైర్‌పర్సన్ శాయిన పుష్పావతి అన్నారు. పంట పూతదశలో ఉన్నకారణంగా తుఫాన్‌కు మొత్తం పూతరాలిపోవడం, చేను పడిపోవడం కారణంగా మొత్తం పంట దెబ్బతిందని ఆమె అన్నారు. శుక్రవారం చినగొన్నూరు గ్రామంలో పుష్పావతి, సాగునీటి సంఘ అధ్యక్షుడు శాయిన ప్రసాద్‌లు వరిచేలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పూత దశలో ఉండగా వర్షం గాలి రావడంతో పూతరాలిపోవడం, గింజ గట్టిపడే దశలో ఉన్న కంకులు తాలుగింజలుగా మారడం వల్ల ఈ ప్రాంతంలో చేలు 80 శాతం నష్టం వాటిల్లాయని పుష్పావతి తెలిపారు.

కురుమద్దాలిలో జాబ్‌మేళా నేడు

పామర్రు : నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నవంబరు1న కురుమద్దాలిలో గల స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు శుక్రవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఓ ప్రకటనలో తెలిపారు. 10 తరగతి నుంచి డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతి, యువకులకు వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామన్నారు. ఎంపికైన వారికి రూ. 8000 నుంచి రూ.20,000 వరకు జీతాలు ఉంటాయన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

నందివాడ : శుక్రవారం గన్నవరంలో జరిగిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో గుడివాడ డివిజన్ అండర్-17 బాలబాలికల బ్యాడ్మింటన్ గుడివాడ సెక్షన్‌లో జిల్లా పరిషత్ పాఠశాల తమిరిశ విద్యార్థులు 9వ తరగతి విద్యార్థులు డి.సందీప్ కుమార్, నాగ చైతన్య, ఎన్.మనీషా, జి.ఈశ్వరి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రసాదరావు తెలిపారు. పొలుకొండ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని కె.రమ్య శ్రీ మండల స్థాయి పోటీలలో నందివాడలో శుక్రవారం జరిగిన గుడివాడ నియోజకవర్గ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు వి.మణి తెలిపారు.

చలసాని రమేష్ చౌదరికి మాతృ వియోగం

పెదపారుపూడి, అక్టోబరు 31 (ఆంధ్ర జ్యోతి): వెంట్రప్రగడలో టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి తల్లి సరోజిని(80) శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె పార్థివదేహాన్ని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, కూటమి నాయకులు సూరపనేని వెంకట సత్యనారాయణ, మనిముక్కు రాంబాబు, కొనుకోల్లు వెంకట రత్న ప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు కూచిపూడి సుబ్బయ్య, నీటి సంఘం అధ్యక్షుడు కూచిపూడి శ్రీనివాసరావు, ఉజ్జినేని చంద్రశేఖర్, చిలకా ఆంజనేయులు, నాగదేశి సునీత, నత్తవాణి, కెజె.రాజు, దగాని లెనిన్, పాల్గొన్నారు.



పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

మొవ్వలో 27 గృహాలకు నష్టం

కూచిపూడి : మొంథా తుపాను ప్రభావం కారణంగా మండల పరిధిలోని పలు గ్రామాల్లో 22 గృహాలు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనాలు రూపొందించారు. మొవ్వలో 7, కోసూరులో 3, పెదపూడిలో 3, చినముత్తేవిలో 2, కాజలో 2, కూచిపూడిలో 2, ఆవిరిపూడి, బార్లపూడి, భట్లపెనుమర్రు గ్రామాల్లో ఒక్కొక్క గృహం దెబ్బతిన్నట్లు తహసీల్దార్ మస్తాన్ తెలిపారు. దెబ్బతిన్న గృహాలకు సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలిపారు.

సైకిల్ అదుపు తప్పి వృద్ధుడి మృతి

గుడివాడ రూరల్ : గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో గల మల్లాయిపాలెం పంచాయతీలోని పద్మావతి రైసుమిల్లులో కూలి పనులు చేసుకునే ఇంటి మాణిక్యాలరావు తండ్రి ఆశీర్వాదం గ్రామం నుంచి తన సైకిల్ మీద తాను పని చేసే రైసుమిల్లు వైపు వెళ్లటకు రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో ముదినేపల్లి వైపు నుంచి ఒక బైక్ రావటం గమనించిన ఆయన కంగారు పడి సైకిల్ మీద నుంచి పడిపోయాడు. దీంతో తలకు బలంగా రోడ్డు దెబ్బ తగిలింది. వెంటనే గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందాడు. ఆయనకు బంధువులు ఎవరు లేరు. తోటి సహచరుడు రైసుమిల్లులో పని చేసే వెలగలేటి పెద్దిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై చంటిబాబు తెలిపారు.

ఘనంగా సత్యదేవుని ఆలయ శిఖర ప్రతిష్ఠ

గుడ్లవల్లేరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులో వేంచేసియున్న శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠా, సంప్రోక్షణ మహోత్సవాలు శుక్రవారం రెండవ రోజు వేదపండితుల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు . విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచన, పంచాంగ ఆరాధన, ప్రాశన, అగ్నిమధనం, అగ్నిప్రతిష్ఠాపన, శిఖర, అంగ హోమము, మూలమంత్ర హననము, స్వామికి శిఖర, యంత్ర చతుర్దశ కలశ స్నపన, పంచగవ్య క్షీరాదివాసము, జలాధివాసము, అధివాసాంగ హోమం, నవగ్రహారాధన, ధాన్యాధివాసము గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు యాజ్ఞీకులు ముత్తేవి శ్రీనివాసశశికాంత్, అర్చక స్వామి రొంపిచర్ల శ్రీనివాసాచార్యుల నేతృత్వంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కొసరాజు బాపయ్యచౌదరి, ఈడుపుగంటి ఉమామహేశ్వరరావు, వల్లూరుపల్లి రామకృష్ణ, పోలవరపు వెంకటరావు, వల్లభనేని వెంకటసుబ్బారావు చౌదరి, యలమంచిలి రామకోటేశ్వరరావు, రవిశంకర్, రవికాంత్, నరేష్, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, పరందామయ్య, మూల్పూరి సుధాకర్ పాల్గొన్నారు.



సంప్రోక్షణా జలాలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న వేదపండితులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీం

పామర్రు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల రోడ్లపై గోతుల్లో నెలకొన్న అపరిశుభ్రతను అన్ని వార్డుల్లో తక్షణమే తొలగించాలని పామర్రు పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీం శానిటరి అధికార సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలో బాపూజీపేట కొండిపర్రు వెళ్లే రహదారిలో డ్రెయినేజీలు పూడుకుపోయి రోడ్లపై గుంతల్లో నీళ్లు నిలిచాయి. శుక్రవారం డ్రెయినేజీల్లోని పూడికతీత పనులను ప్రత్యేక ఎక్సకవేటర్‌తో తొలిగించారు. హిందూ శ్మశాన వాటికకు వెళ్లే రహదారిపై పడిన భారీ గోతులకు మరమ్మతులు చేశారు. ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా పంచాయతీ సరఫరా చేస్తున్న పరిశుభ్రమైన తాగునీటిని అవసరం మేరకు కాచి చల్లార్చిన నీటిని సేవించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరి అధికారి సుధాకర్, మేస్త్రీ మాడుగుల శివనాగు, విశ్వనాథ్, అలేఖ్య , పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీం



గుర్రపుడెక్క తొలగింపు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా, గురుమూర్తి

పంట కాలువలో తూడు తొలగింపు

తోట్లవల్లూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు కనకదుర్గమ్మ కాలనీ వద్ద పంట కాలువల్లో దట్టంగా పెరిగి మురుగు ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపుడెక్క తొలగింపు బాధ్యతను రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి తీసుకున్నారు. దీంతో ఎక్సకవేటర్‌తో తూడు తొలగింపు పనులకు శుక్రవారం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా కొబ్బరికాయ కొట్టారు. తోట్లవల్లూరు ఎస్సీ కాలనీలో అనారోగ్యంతో ఉన్న జుజ్జువరపు పద్మజకు రూ. 10 వేలు, తటుకూరి సోమనాథానికి రూ. 10 వేలను ఎమ్మెల్యే కుమార్ రాజా చేతుల మీదుగా పీ4 పథకం కింద గురుమూర్తి అందించారు.

కరాటే పోటీల్లో షైనింగ్ స్టార్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ : ఇటీవల మంగళగిరిలో నిర్వహించిన 16వ ఇంటర్ స్టేట్ ఇన్విటేషనల్ జపాన్ షిటో కరాటే చాంపియన్ షిప్‌లో గుడివాడ బైపాస్ రోడ్డులో గల శ్రీ సాయిషైనింగ్ స్టార్ స్కూల్‌కి చెందిన విద్యార్థులు ఎనిమిది మంది పాల్గొని అద్భుత ప్రతిభ కనబర్చారు. వారి విజయంపై పాఠశాల యాజమాన్యం జగదీష్, స్రవంతిలు విద్యార్థులను, తల్లిదండ్రులను, కోచ్ రామకృష్ణను అభినందించారు.

పవర్‌లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

గుడివాడ: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మెమోరియల్ ఉమ్మడి కృష్ణాజిల్లాల ఓపెన్ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్‌లో 120మంది క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, సభ్యులు లక్ష్మీవరప్రసాద్, కృష్ణా జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి మహ్మద్ సైదా, యమ్.సత్యనారాయణ, కోచ్‌లు పాల్గొన్నారు.

గరికపర్రులో ఘనంగా శివరామ్ జన్మదినోత్సవం

తోట్లవల్లూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : గరికపర్రు సాయి కల్యాణ మండపంలో శుక్రవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకుడు ఎస్‌వీ కృష్ణారావు కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. అలాగే మండలంలో 20 చోట్ల టీడీపీ కార్యకర్తలు కేక్‌లను కట్ చేసి శివరామ్ జన్మదినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఉయ్యూరులో తుఫాను బాధితులకు నిత్యావసర కిట్‌లనూ అందించామని నాయకులు తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు నర్రా వెంకట అప్పారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గూడపాటి గిరిబాబు, లుక్కా రేణుకారావు, మాజీ వైస్ ఎంపీపీ వీరంకి వరహాలరావు, చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం, గోళ్ల శివ తదితరులు పాల్గొన్నారు.



కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు కృష్ణారావు

విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధం




మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కూచిపూడి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాజ గ్రామానికి చెందిన ఉప్పల రామయ్యకు చెందిన పూరిల్లు, పశువుల పాక అగ్నికి ఆహుతి అయ్యాయి. సుమారు రూ.2 లక్షల మేర ఆస్తినష్టం సంభవించింది.స్థానికుల సమాచారం మేరకు మొవ్వ అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

మొబైల్ అనర్థాలపై అవగాహన తప్పనిసరి

● వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ భాగ్య

గుడివాడ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : మొబైల్ వినియోగం వల్లే కొత్త పోకడలకు లోనై సమాజంలో అరాచకాలు అత్యధికంగా జరుగుతున్నాయని ఫాదర్ బియాంకీ ఉన్నత పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ భాగ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఏలూరురోడ్డులోని పాఠశాల వద్ద నుంచి పాఠశాల యంగ్ స్టూడెంట్ మూమెంట్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరానికి మించి మొబైల్ వినియోగాన్ని తగ్గించి కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆరోగ్య ఉపకేంద్రానికి సామగ్రి వితరణ

గుడివాడ రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్ మండలంలోని లింగవరం వైద్య ఆరోగ్య ఉపకేంద్రాలకు ప్రముఖ పారిశ్రామిక వేత్త, లింగవరం గ్రామవాసి, గ్రానైట్ అధినేత కొల్లారెడ్డి రామ రాఘవరెడ్డి లింగవరం పీహెచ్‌సీ సబ్ సెంటర్‌కు 50 ఛైర్లు, ఏసీ మిషన్లు, వాటర్ కూలర్, బీరువాలుగా ఉచితంగా శుక్రవారం అందజేశారు. వారి తల్లి జ్ఞాపకార్థం కొల్లారెడ్డి సుశీలమ్మ (టీచర్) జ్ఞాపకార్థం బంజారాహిల్స్‌లో గ్రానైట్ వ్యాపారం నిర్వహిస్తూ తన తల్లి జ్ఞాపకార్థమై రోగులకు ఇబ్బంది లేకుండా వస్తువులు ఏర్పాటు చేశారు. వీరిని కూటమి నాయకులు అభినందించారు.

ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

పెదపారుపూడి : భారత రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛ , సమాన అవకాశాలను అన్నీ రంగాలలోని ప్రజలందరికీ అందించాలని తహసీల్దార్ శ్రీను నాయక్ పేర్కొన్నారు. జస్టిస్ పున్నయ్య కమీషన్ సిఫార్సులు ఆధారంగా ఆంధ్రప్రదేశ్ ప్ర భుత్వం ఉత్తర్వుల మేరకు వెంట్రప్రగడలో తహసీల్దార్ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అప్పికట్ల ఆశాజ్యోతి, ఎంపీడీవో విమాదేవి, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్, కార్యదర్శి సాగర్ రాణి, వీఆర్వో ఫణి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మేనమామపై మేనల్లుడి దాడి

గుడివాడ : తన కుటుంబం పట్ల దుష్ప్రచారం చేస్తున్న మేనల్లుడిని మందలించిన నేపథ్యంలో మేనమామపై దాడి చేసి గాయపరచిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక నైజాంపేటకు చెందిన అహ్మద్ సాహెబ్ పెద్దమసీదుకు వెళ్లి వస్తుండగా వెనుక నుంచి మేనల్లుడు రోషన్ దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై పి.లోవరాజు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

కార్తీకమాసంలో పుణ్యస్నానాలు, దానాలతో విశేష ఫలితం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో పుణ్యస్నానాలు, దీపదానాలు చేయడం వల్ల విశేష ఫలితం ఉంటుందని సిరికవి డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మాచవరం అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం కార్తీకమాసం విశిష్టతపై ఆయన ప్రసంగించారు. ఈనెల 5వ తేదీ వరకు దేవాలయంలో ప్రవచనాలు, భజనలు నిర్వహిస్తున్నామని ధర్మప్రచార పరిషత్ జిల్లా ప్రతినిధి తురగా ప్రసాద్ తెలిపారు. పండితులను ఆలయ ఈవో టీవీవీ మోహనరావు, తురగా ప్రసాద్ సత్కరించారు.


ఉపన్యసిస్తున్న డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

మచిలీపట్నం టౌన్/చల్లపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి, దేశ తొలి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని శుక్రవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రన్ ఫర్ యూనిటీ ర్యాలీలను మచిలీపట్నం, చల్లపల్లిలో నిర్వహించారు. మచిలీపట్నం జిల్లా కోర్టు సెంటర్ నుంచి జిల్లా పోలీసు కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఏఎస్పీలు సత్యనారాయణ, వి.వి.నాయుడు, టౌన్ డీఎస్పీ సీహెచ్ రాజా, సీఐలు ఏసుబాబు, పరమేశ్వర్, నబీ, ఎస్సైలు, పోలీసులు, హోమ్‌గార్డులు పాల్గొన్నారు. మచిలీపట్నంలో ఫిట్ ఇండియా ఫ్రీడం రన్ 6.0 ర్యాలీని పోస్టల్ ఉద్యోగులు నిర్వహించారు. హెడ్ పోస్టాఫీసు నుంచి బయలుదేరి కోనేరుసెంటర్, రేవతీసెంటర్, బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. పోస్టల్ అధికారులు బి. శ్రీనివాసరావు, కె.వి. కిరణ్‌కుమార్, ఎం. శివప్రసాద్‌బాబు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు. సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌లో ఎన్‌సీసీ విద్యార్థులు రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలు జరిపారు. వివిధ కళాశాలలు, పాఠశాలల ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు. చల్లపల్లిలో సీఐ కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ పార్కు నుంచి పోలీసు అధికారులు, సిబ్బంది, పురప్రముఖులు, వాకర్స్ ప్రతినిధులు ర్యాలీ నిర్వహించి ప్రధాన సెంటరులో మానవహారం ఏర్పాటుచేశారు. పార్కు నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ సాగింది. ఎస్సైలు పీఎస్వీ సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, ట్రైనీ ఎస్సై శ్రీలత, ప్రముఖులు జి.వి.తాతారావు, తోట కృష్ణారావు, ఉప్పల సాంబశివరావు పాల్గొన్నారు.



మచిలీపట్నంలో రన్ ఫర్ యూనిటీ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, చల్లపల్లిలో ర్యాలీలో పాల్గొన్న సీఐ ఈశ్వరరావు, వాకర్స్ ప్రతినిధులు

పటేల్‌కు నివాళి

మచిలీపట్నం టౌన్: 500కు పైగా సంస్థానాలను దేశంలో విలీనం చేసి సర్దార్ వల్లభాయ్ పటేల్ చరిత్ర సృష్టించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్ అన్నారు. సర్కిల్‌పేటలో బీజేపీ స్థూపం వద్ద శుక్రవారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నాగలింగం అయోధ్యరామచంద్రరావు ఆధ్వర్యంలో వల్లభాయ్‌పటేల్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పంతం వెంకట గజేంద్రరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల రామాంజనేయులు, తోట రంగనాథ్, దేవారి ధనలక్ష్మి, పుప్పాల హరి, చలమలశెట్టి రామకృష్ణ, కంచర్లపల్లి రామారావు, సలాది రామకృష్ణ, ఎస్ఎస్ నాయుడు, బొమ్మిడి నారాయణస్వామి పాల్గొన్నారు.


వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్


ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, దాత లక్ష్మీపురపు అజయ్‌బాబును సత్కరిస్తున్న ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు

ఆలయ అభివృద్ధికి సహకారమందిస్తా

- అగస్త్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీతో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన స్ట్రాంగ్ రూమ్, ఆఫీసు రూమ్, వాటర్ ట్యాంకులను దాత కలిదిండికి చెందిన పారిశ్రామికవేత్త లక్ష్మీపురపు అజయ్‌బాబుతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, దాత అజయ్‌బాబును అభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ల ప్రసాద్, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చందన నారాయణరావు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం

పెడన: మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ భరోసా ఇచ్చారు. శుక్రవారం తన కార్యాలయంలో తుఫాన్ కారణంగా చేనేత కార్మికులకు వాటిల్లిన నష్టంపై సచివాలయ ఉద్యోగులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నష్టపోయిన కార్మికులను గుర్తించేందుకు ఎన్యూమరేషన్‌ను నిష్పక్షపాతంగా చేయాలని సూచించారు. టీడీపీ నాయకులు యక్కల శ్యామలయ్య, బొర్రా కాశీ, వడుగు తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంకు వైస్ చైర్మన్‌గా

వంపుగడల చౌదరి ప్రమాణస్వీకారం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు వైస్‌చైర్మన్‌గా వంపుగడల చౌదరి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. బ్యాంకు ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వంపుగడల చౌదరిని డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, అర్బన్ బ్యాంకు చైర్మన్ ఐ.దిలీప్‌కుమార్, కార్యదర్శి రాజ్‌కుమార్, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు సత్కరించారు. సమీర్, గంపల భవానీ, బుజ్జి, పినిశెట్టి వేణు, శాయన శివయ్య పాల్గొన్నారు.


వంపుగడల చౌదరిని సత్కరిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, అర్బన్ బ్యాంకు అధ్యక్షుడు దిలీప్‌కుమార్

నాగాయలంక రేవుకు భారీ వరద

నాగాయలంక, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదల చేస్తున్న లక్షలాది క్యూసెక్కుల వరదనీరు శుక్రవారానికి నాగాయలంక రేవుకు భారీగా చేరింది. శ్రీరామపాదక్షేత్రంలో ఉన్న కృష్ణవేణమ్మ విగ్రహానికి నడుము లోతుగా నీరు చేరింది. చెంతనే రామలింగేశ్వరస్వామి ఆలయంలోకి వరద నీరు చేరి శివలింగం, నంది విగ్రహాలు మాత్రమే కనిపిస్తున్నాయి. మత్స్యకారులు పడవలను ఒడ్డుకు చేర్చి లంగర్లు వేశారు. ఇటీవల మొంథా తుపాను మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీయగా, వరద మళ్లీ వచ్చి తమ జీవితాలతో ఆటలాడుకుంటోందని జాలరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కృష్ణానది ఒడ్డున లంగర్లు వేసి ఉంచిన పడవలు

14,500 మందికి ఆర్థిక సాయం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బందరు డివిజన్ పరిధిలో 11 మండలాల్లో ఏర్పాటు చేసిన 124 పునరావాస కేంద్రాలకు వచ్చిన 14,500 మందికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున ఆర్థిక సాయం అందించే కార్యక్రమం ప్రారంభించామని ఆర్డీవో కె.స్వాతి తెలిపారు. మత్స్యకారులకు 50 కిలోలు, ఇతరులకు 25 కిలోల బియ్యాన్ని అందిస్తున్నామన్నారు.

నిత్యావసరాలు అందజేత

అవనిగడ్డ రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వరదలు, తుఫాన్ కారణంగా జీవనభృతి కోల్పోయిన 50 మత్స్యకార కుటుంబాలకు జేసీ నవీన్, ఆర్డీవో స్వాతి ఆధ్వర్యంలో పులిగడ్డలో సాయమందించారు. ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కందిపప్పు, ఉల్లిపాయలు, పంచదార, నూనె, బంగాళదుంపలు, 50 కిలోల బియ్యం అందజేశారు. తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పులిగడ్డ వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


మత్స్యకారులకు నిత్యావసరాలు అందిస్తున్న జేసీ నవీన్, ఆర్డీవో స్వాతి, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు

గండి పడి పొలాల్లోకి చేరిన వరద నీరు

పులిగడ్డ పల్లిపాలెంలో 400 ఎకరాల్లోకి గండి పడి వరద వచ్చి పంట నష్టం జరుగుతోందని జేసీ నవీన్ దృష్టికి సర్పంచ్ తీసుకొచ్చారు. సమస్యను పరిష్కరిస్తానని జేసీ హామీ ఇచ్చారు.

తుఫాన్ బాధితులకు మార్కెటింగ్ శాఖ చేయూత

మోపిదేవి: తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న బాధిత కుటుంబాలకు మార్కెటింగ్ శాఖ అధికారులు ఉల్లిపాయలు, దుంపలు పంపిణీ చేశారు. మండలంలో 1013 కుటుంబాలు పునరావాస శిబిరాల్లో తలదాచుకోగా, వారికి మార్కెటింగ్ శాఖ అందించిన ఉల్లిపాయలు, దుంపలను తహసీల్దార్ ఎం.హరనాథ్‌కు దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అందించారు. కుటుంబానికి కేజీ చొప్పున దుంపలు, ఉల్లిపాయలు పంపిణీ చేస్తామన్నారు.

కొడాలిలో 59 కుటుంబాలకు..

ఘంటసాల: కొడాలిలో 59 కుటుంబాలకు 25 కేజీల బియ్యం, కిలో కందిపప్పు, బంగాళదుంపలు, కేజీ నూనె, పంచ దార, ఉల్లిపాయలను టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, సర్పంచ్ చలపాటి రాణి, తహసీల్దార్ విజయప్రసాద్, జనసేన మండల అధ్యక్షుడు కోన రాజశేఖర్ అందజేశారు. శ్రీకాకుళంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు, తెలుగురావుపాలెంలో తుమ్మల చౌదరిబాబు, సర్పంచ్ రాచూరి ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొన్నాం

కోడూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ విపత్తును అధికారులు సహకారంతో సమర్థవంతంగా ఎదుర్కొన్నామని సహకారం అందించిన అధికారులు, కూటమి నాయకులకు జనసేన మండల అధ్యక్షుడు మర్రె గంగయ్య కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కోడూరు ప్రాంతానికి వచ్చి తుఫాను ప్రభావిత వరి పొలాలను పరిశీలించడం సంతోషకరమన్నారు. మండలం దిగువ ప్రాంతంలో ముంపునకు గురవుతున్న పంట పొలాలు, అవుట్‌ఫాల్స్ నిర్మాణంపై వీడియో ద్వారా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఎంపీ బాలశౌరి తీసుకెళ్లారన్నారు. నాబార్డు నుంచి నిధులు మంజూరు కాగానే అవుట్ ఫాల్స్ నిర్మాణం చేపడతామని తెలిపారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 41వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఇందిరాగాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కోకా ఫణిభూషణ్ నివాళులర్పించారు. నల్లబోలు కుమారి, చిలుకోటి ప్రసాద్, ఆయూబ్, రెడ్రౌతు వెంకటనారాయణ పాల్గొన్నారు.

క్రీడాకారులకు సీకే నాయుడు స్ఫూర్తిదాయకం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 31 (ఆంధ్ర జ్యోతి): భారత క్రికెట్ జట్టుకు తొలి కెప్టెన్ సీకే నాయుడు క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని ఆర్టీసీ డిపో మేనేజర్ టి.పెద్దిరాజు అన్నారు. శుక్రవారం నగరంలోని కల్నల్ సీకే నాయుడు విగ్రహం వద్ద నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆయన నివాళులర్పించారు. సినీగేయ రచయిత కోసూరి మాధవవెంకటకృష్ణ, కృష్ణా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ శ్రీనివాస్, మండలి దుర్గాప్రసాద్, లంకిశెట్టి బాలాజీ, గిరికుమార్, బడే జీవన్, ప్రభాకర్, బి. కృష్ణ, జి. శివ పాల్గొన్నారు.


కల్నల్ సీకే నాయుడు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు

పంట కాలువలో మృతదేహం

కోడూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పోటుమీద గ్రామం వద్ద వక్కపట్లవారిపాలెం మందపాకల పంట కాలువలో గుర్తుతెలియని పురుషుడి మృతదేహాన్ని గుర్తించినట్టు ఎస్సై చాణక్య తెలిపారు. 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉంటుందని, దేహంపై నలుపు రంగు టీ షర్టు, పచ్చ రంగు షార్ట్ ఉన్నాయని తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే కోడూరు లేక అవనిగడ్డ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ తీగ తగిలి వ్యవసాయ కూలీ మృతి

- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

చల్లపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగ తగిలి వ్యవసాయ కూలీ మృతిచెందిన ఘటనపై చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఘంటసాల మండలం లంకపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ కుంపటి కోటయ్య(49)కు మాజేరులో మురుగుకాల్వ సమీపంలో 30 సెంట్ల పొలం ఉంది. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో భార్య చంద్రమ్మతో చెప్పి పొలం వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికిరాలేదు. క్యారేజీ తీసుకుని భార్య పొలం వెళుతుండగా, గ్రామానికి చెందిన వ్యక్తి ఎదురువచ్చి కోటయ్య కరెంటు షాకుతో చనిపోయి మురికికాలువ గట్టుమీద పడిపోయి ఉన్నాడని చెప్పాడు. అక్కడికి వెళ్లిచూడగా కరెంటు తీగలు తగిలి కోటయ్య చనిపోయిఉన్నాడు. వైరు కిం దికి వేలాడుతూ ఉందని, తన భర్త మృతిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని చంద్రమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ట్రైనీ ఎస్ఐ శ్రీలత కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్షకు అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి నోటికి విద్యుత్ తీగ ఇరుక్కుని ఉంది. సమీపంలో పుల్లల మోపు పడి ఉంది. పొయ్యిలోకి పుల్లలు నరుక్కుని తెస్తూ విద్యుత్ తీగ తగలడంతో మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

నేలకొరిగిన వరి పొలాల్లో

నీటిని తొలగించాలి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తుఫాన్, అధిక వర్షాల వల్ల నేలకొరిగిన వరి పొలాల్లో నీటిని తొలగించాలని ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త ఎం.గిరిజారాణి సూచించారు. బందరు మండలం వాడపాలెంలో నేలకొరిగిన వరిపొలాలను శాస్త్రవేత్తలతో కలిసి ఆమె సందర్శించారు. ముంపునకు గురయిన పొలాల్లోని గింజలు మారకుండా ఎకరానికి 200 మి.లీ చొప్పున ప్రొపికోనజోల్ పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయాధికారి రామ్‌కుమార్ పాల్గొన్నారు.


వాడపాలెంలో వరి పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త గిరిజారాణి

దెబ్బతిన్న వరి పంటల పరిశీలన

మోపిదేవి/చల్లపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న వరి పంటలను శుక్రవారం ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి, శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. మోపిదేవి మండలం వెంకటాపురం, శివరామపురం, రావివారిపాలెం, చల్లపల్లి మండలం పాగోలు గ్రామాల్లో వారు పర్యటించారు. ప్రస్తుతం వరి పంట పాలు పోసుకునే దశలో ఉందని, కొన్ని చోట్ల వరి గింజలు గాలులకు పగిలిపోయాయని, పంట నేలకు ఒరగకుండా ఉన్నప్పటికీ వరి గింజలు పగలటంతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం 35 శాతం నష్టం వాటిల్లితేనే నమోదు చేసి పరిహారం అందిస్తారని తెలిపారు. మోపిదేవి మండలంలో 3 వేలకుపైగా ఎకరాలు దెబ్బతినట్లు ప్రాథమికంగా అధికారులు అంచనా వేశారని, వ్యవసాయ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేస్తారని తెలిపారు. మోపిదేవి మండలంలో ఏవో హెబ్సిబా రాణి, పాగోలులో ఏవో కె.మురళీకృష్ణ, పాల్గొన్నారు.

నాగాయలంక: గుల్లలమోదలో ముంపునకు గురైన వరి పొలాలను ఇన్‌చార్జ్ ఎంపీడీవో చంద్రశేఖర్, ఏవో సంజీవ్‌కుమార్ పరిశీలించారు. గ్రామంలో 250 ఎకరాలు ముంపు బారిన పడిందని అధికారులకు రైతులు వివరించారు.

రైతులకు ఆర్థిక సాయం అందించాలి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ కోరారు. శుక్రవారం బందరు మండలం కానూరులో రైతులతో కలిసి ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా జిల్లాలోని వివిధ గ్రామాల్లో అధికారులు బ్లీచింగ్ చల్లించాలన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలి

నాగాయలంక, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నాగాయలంక 11వ వార్డులో తుఫాన్‌కు రోడ్డుకు అడ్డంగా పడిన విద్యుత్ స్తంభాన్ని ఇప్పటి వరకు తీయలేదని, ఆ వీధికి విద్యుత్ సరఫరా ఇవ్వలేదని శుక్రవారం మహిళలు విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట కొద్దిసేపు నిరసన తెలిపారు. స్పందించిన విద్యుత్ సిబ్బంది తాత్కాలికంగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కమిషనర్ చంద్రశేఖరరెడ్డి పదవీ విరమణ

పెడన, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి శుక్రవారం పదవీ విరమణ చేశారు. నాలుగు నెలల సర్వీసు మాత్రమే ఉన్న ఆయనను నాలుగు నెలల క్రితం పెడన కమిషనర్‌గా నియమించారు. శుక్రవారంతో ఆయన సర్వీసు పూర్తయింది. సర్వీసు పూర్తవడంతో శుక్రవారం ఆయన పదవీ విరమణ చేశారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

గూడూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలు, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సూచనల మేరకు ఎల్ఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్లవోలు గ్రామంలో శుక్రవారం 100 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. దాత లింగ నాగేశ్వరరావు, పడవల మోహన్ త్రినాథ్, ముద్దినేని వెంకటేశ్వరరావు, ముంగర వీరబాబు, పత్తిపాటి శివ, లింగినేని శివరాం పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

గూడూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కప్పలదొడ్డి గ్రామంలో జిల్లా పరిషత్ నిధులతో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ యక్కల మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు పేరిశెట్టి తేజావతి శుక్రవారం ప్రారంభించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.





